VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
రంగారెడ్డి, నల్గొండ : శనివారం 13.06.2026
సంపుటి : 08 సంచిక : 04 , పేజీలు : 12 , వెల:రూ . 5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH
www.velthuru.com



ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ గారితో సమావేశమైన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్.
రాష్ట్ర రాజకీయాలు, తాజా పరిస్థితులపై చర్చించిన నాయకులు..
ఢిల్లీ వెలుతురు జూన్ 12:

# వ్యవసాయ శాస్త్రవేత్తకు లక్ష రూపాయల అవార్డు ప్రదానం చేసిన డాక్టర్ వైఎస్ఆర్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 12:**

దివంగత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన ఆత్మీయ మిత్రుడు డాక్టర్ కె.వి.పి. రామచంద్రరావు స్థాపించిన ప్రజాహిత సేవా ట్రస్ట్ "డా. వైఎస్ఆర్ & డా. కెవిపి ఫౌండేషన్", హైదరాబాద్‌లోని రాజేంద్ర నగర్‌లో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ శాస్త్రాల్లో విద్యాభ్యాసం చేస్తున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ. 1.00 లక్ష నగదు పురస్కారం అందించేందుకు రూ. 21.00 లక్షల రివాల్వింగ్ ఫండ్ను విరాళంగా అందజేసింది.ఫౌండేషన్ తరఫున మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీ ఉండవల్లి అరుణ్ కుమార్ గారు ఈ చెక్కును విశ్వవిద్యాలయ వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జనయ్య గారికి అందజేశారు. ఈ కార్యక్రమం 12 జూన్ 2026న నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ వ్యవస్థాపక దినోత్సవం మరియు "భారతదేశంలో వ్యవసాయ పరిశోధన, విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో హరిత విప్లవానికి దివంగత శ్రీమతి ఇందిరా గాంధీ చేసిన విశేష కృషి" అనే జాతీయ సదస్సు సందర్భంగా జరిగింది.ఈ కార్యక్రమానికి భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

## డాక్టర్ కేవీపీ ఫౌండేషన్ ట్రస్ట్




జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, బెంగళూరులోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్‌కు చెందిన ప్రొఫెసర్ మధురా స్వామినాథన్, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ శ్రీ ఎం. కోదండరెడ్డి తదితర ప్రముఖులు హాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా ఫౌండేషన్ విద్యా ప్రతిభను ప్రోత్సహించడం, అర్హులైన విద్యార్థులను ఆదుకోవడం పట్ల తన నిబద్ధతను మరోసారి చాటుకుంది. వ్యవసాయం అనేది డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారి హృదయానికి అత్యంత సన్నిహితమైన అంశం. రైతుల సంక్షేమం మరియు వ్యవసాయ రంగ అభివృద్ధికి ఆయన నిరంతరం కృషి చేశారు. వ్యవసాయ శాస్త్రాల విభాగంలో ఈ పురస్కారాన్ని స్థాపించడం ద్వారా ఆయన దూరదృష్టికి, విద్య మరియు వ్యవసాయాభివృద్ధి ద్వారా గ్రామీణ సమాజ సాధికారతకు చేసిన కృషికి తగిన నివాళి అర్పించినట్లవుతుంది.డా. కె.వి.పీ. రామచంద్రరావు గారు తన ఆత్మీయ మిత్రుడు దివంగత డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు స్థాపించిన ప్రజాహిత సేవా సంస్థ డా. వైఎస్ఆర్ & డా. కెవిపి ఫౌండేషన్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్‌లో వ్యవసాయ శాస్త్రాల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహంగా ప్రతి సంవత్సరం రూ.1.00 లక్ష నగదు బహుమతిని అందించేందుకు రూ.21.00 లక్షల రివాల్వింగ్ ఫండ్‌ను విరాళంగా అందించింది.ఈ నిధికి సంబంధించిన చెక్కును ఫౌండేషన్ తరఫున మాజీ పార్లమెంట్ సభ్యులు ఉండవల్లి అరుణ్ కుమార్ గారు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జనయ్య గారికి అందజేశారు. ▶ మిగతా 2లో




## ఇంధన సంక్షోభంపై కేంద్రం కొరడా

- సాధారణ బంకుల్లో భారీ కొనుగోళ్లపై నిషేధం.. వాహనానికి రోజుకు 200 లీటర్లే పరిమితి
- పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో అంతర్జాతీయ చమురు సరఫరా వ్యవస్థకు తీవ్ర అంతరాయం

## గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్ గా తెలంగాణ




- 'లాజిస్టిక్స్ పాలసీ 2.0' ద్వారా మౌలిక వసతుల వృద్ధికి పెద్దపీట
- లాజిస్టిక్స్ లోనూ సమర్థవంతంగా ఎమర్జింగ్ టెక్నాలజీస్ వినియోగం
- 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్'లో మంత్రి శ్రీధర్ బాబు

## ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు




- పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఉత్పత్తి పెంపు కాదు పంటలకు విలువ పెంచడమే తెలంగాణ వ్యవసాయ భవిష్యత్తు : మంత్రి తుమ్మల
- AI, డ్రోన్లు, ప్రెసిషన్ ఫార్మింగ్‌తో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు రావాలి
- రైతు ఆదాయం పెంచేందుకు విలువ ఆధారిత, మార్కెట్ ఆధారిత వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

## ఓట్ల వేటలో 'కేంద్రం' దొంగదారి!

- కాంగ్రెస్ బలంగా ఉన్న చోట ఓట్ల తొలగింపునకు కుట్ర
- 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్' పేరిట లేపేసే ప్లాన్
- బీహార్, బెంగాల్ ఫార్ములాను ఇక్కడా ప్రయోగిస్తున్నారు
- కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్ష ప్రభుత్వాలపై దాడి
- పాలేరు 'బి.ఎల్.ఏ'ల శిక్షణ శిబిరంలో మంత్రి పొంగులేటి నిప్పులు




ఏదులాపురం మున్సిపాలిటీ వెలుతురు జూన్ 12:: కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రతిపక్ష పార్టీలను, ప్రతిపక్ష ప్రభుత్వాలను టార్గెట్ చేస్తూ ప్రజాస్వామ్య విరుద్ధమైన కుట్రలకు తెర లేపిందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## జాతీయ రహదారి పనులను అక్టోబర్ 2 నాటికి పూర్తి చేయాలి - మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్ వెలుతురు జూన్ 12:**

హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్కతుర్తి నుండి సిద్దిపేట వరకు నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి పెండింగ్ పనుల పురోగతిపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు.జాతీయ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేసి వచ్చే అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, వచ్చే 100 రోజులను లక్ష్యంగా పెట్టుకుని పనులను పూర్తి చేయాలని సూచించారు.

▶ మిగతా 2లో

## మోదీ పుష్కర పాలన ఎట్లుంది?

- మోదీ 12 ఏళ్ల పాలనా విజయాలపై ఆటో డ్రైవర్ కు పుస్తకాలను అందించిన కేంద్ర మంత్రి
- మోదీ పాలనలో ప్రజలకు ఇష్టమైన కార్యక్రమాలేమిటని ఆరా తీసిన బండి సంజయ్.
- కాంగ్రెస్ పాలనపైనా అభిప్రాయాలు అడిగి తెలుసుకున్న కేంద్ర మంత్రి


**రేకొండ వెలుతురు జూన్ 12:**

నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలనా విజయాలపై వివరిస్తూ వివిధ వర్గాలను కలుస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మం బండి సంజయ్ కుమార్ శుక్రవారం రోజున ఆటో డ్రైవర్ ను కలిశారు. ఆటోలో ఎక్కి కాసేపు ప్రయాణించారు. ''స్వచ్ఛ పాఠశాల'' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజున ఉదయం హుస్నాబాద్ నియోజకవర్గం రేకొండ గ్రామానికి విచ్చేసిన బండి సంజయ్ తిరుగు ప్రయాణంలో రేకొండ ఆటో స్టాండ్ వద్ద ఆగారు. కరీంనగర్ వైపు వెళుతున్న ఆటోలో ఎక్కారు. దిలీప్ అనే ఆటో డ్రైవర్ ను పలకరిస్తూ... మోదీ 12 ఏళ్ల పాలన ఎట్లుందంటూ ఆరా తీశారు. ''మోదీ గారు అనేక పథకాలను అమలు చేశారు. ఉచిత బియ్యం మోదీ ఇస్తున్నారు. ఉజ్వల గ్యాస్ ఇస్తున్నారు. గ్రామాలకు రోడ్లన్నీ మోదీ ప్రభుత్వం వేసినవే. జాతీయ రహదారుల పైసలన్నీ కేంద్రానివే.




## రాజ్యసభలో కొత్త సమీకరణాలు.. 24 స్థానాలు ఏకగ్రీవం

- ఎన్నికల ముందే 24 మంది అభ్యర్థుల విజయం ఖాయం
- పెద్దల సభలో ఎన్డీయే బలం పెరిగిన తాజా ఫలితాలు
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు మరోసారి రాజ్యసభ అవకాశం




## ఆంక్షల ఆటలు సాగనివ్వం!

- పాశ్చాత్య దేశాల కపట నీతిపై జైశంకర్ ఉగ్రరూపం
- రష్యా చమురు కొనమని చెప్పిందే అమెరికా..
- రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికాది ద్వంద్వ వైఖరి
- అంతర్జాతీయ వేదికపై చీల్చిచెండాడిన విదేశాంగ మంత్రి
- ఉక్రెయిన్ యుద్ధం మొదలైన కొత్తలో చమురు ధరలు

అదుపు చేయడానికి భారత్‌ను బతిమాలిన శ్వేతసౌధం



# ఇంధన సంక్షోభంపై కేంద్రం కొరడా

- పరిశ్రమలు, కమర్షియల్ సంస్థలు రిటైల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొనకుండా కేంద్రం ఆంక్షలు
- సాధారణ బంకులు, బల్క్ రేట్ల మధ్య భారీ ధరల వ్యత్యాసం.. డీజిల్‌కు అసాధారణంగా పెరిగిన డిమాండ్
- రిటైల్ బంకుల్లో లీటర్ డీజిల్ రూ. 95.20 కాగా.. బల్క్ మార్కెట్‌లో రూ. 134.50 గా నమోదు
- సాధారణ వినియోగదారులను కాపాడేందుకు ప్రభుత్వ రంగ చమురు సంస్థల ఊరట చర్యలు

**ఢిల్లీ వెలుతురు జూన్ 12:**

పశ్చిమాసియా దేశాలలో రోజురోజుకూ ముదురుతున్న యుద్ధ సంక్షోభం ప్రపంచవ్యాప్తంగా చమురు రవాణాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ప్రభావంతో భారతదేశంలో ఇంధన సరఫరా గొలుసు (సప్లై చైన్) దెబ్బతినకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక అత్యవసర మరియు సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తగా పారిశ్రామిక, వాణిజ్య, సంస్థాగత వినియోగదారులపై కీలక ఆంక్షలు విధించింది. భారీ పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, కమర్షియల్ సంస్థలు సాధారణ ప్రజలు ఉపయోగించే రిటైల్ పెట్రోల్ బంకుల నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేయకుండా కేంద్రం పూర్తిగా నిషేధించింది.కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా నిబంధనల ప్రకారం.. పారిశ్రామిక అవసరాలు కలిగిన కస్టమర్లు తమకు కావలసిన పెట్రోల్, డీజిల్‌ను కేవలం బల్క్ (మొత్తం) అమ్మకపు కేంద్రాల నుంచి మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సాధారణ వాహనదారులు వెళ్లే రిటైల్ అవుట్‌లెట్లలో వీరు ఇంధనం తీసుకోకూడదు. అంతేకాకుండా, పెట్రోల్ బంకుల్లో ఇంధన లభ్యతను సమతుల్యం చేయడానికి కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఒక కీలక పరిమితిని విధించింది. ఇకపై ఏ ఒక్క వాహనానికి లేదా కస్టమర్‌కు రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్ నింపవద్దని దేశంలోని అన్ని పెట్రోల్ బంకుల యాజమాన్యాలను ఆదేశించింది.దేశంలో అకస్మాత్తుగా కొన్ని ప్రాంతాలలో డీజిల్‌కు విపరీతమైన అసాధారణ డిమాండ్ పెరగడానికి గల కారణాలను కేంద్రం విశ్లేషించింది. సాధారణ రిటైల్ బంకుల్లో ఉన్న రేట్లకు, బల్క్ మార్కెట్ రేట్లకు మధ్య ఉన్న భారీ ధరల వ్యత్యాసమే ఇందుకు కారణమని తేలింది. ఉదాహరణకు దేశ రాజధాని ఢిల్లీలోని సాధారణ పెట్రోల్ బంకుల వద్ద లీటరు డీజిల్ ధర రూ. 95.20 గా ఉంటే.. అదే పరిశ్రమలకు సరఫరా చేసే బల్క్ మార్కెట్‌లో లీటర్ డీజిల్ ధర రూ. 134.50 గా ఉంది. అంటే లీటరుకు సుమారు 40 రూపాయల తేడా ఉండటంతో, భారీ పరిశ్రమల నిర్వాహకులు బల్క్ కేంద్రాలను కాదని, సాధారణ పెట్రోల్ బంకులపై పడి డీజిల్‌ను పెద్ద ఎత్తున తోడేయడం ప్రారంభించారు.పశ్చిమాసియా సంక్షోభం తర్వాత అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగినప్పటికీ, దేశంలోని సామాన్య మధ్యతరగతి వినియోగదారులపై ఆ భారం పడకుండా ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు రిటైల్ ధరలను స్థిరంగా ఉంచాయి. ఉత్పత్తి వ్యయం కంటే తక్కువ ధరకే రిటైల్ బంకుల్లో ఇంధనాన్ని విక్రయిస్తున్నాయి. అయితే టెలికాం టవర్లు, ప్రైవేట్ విద్యుత్ ప్లాంట్లు, భారీ ఫ్యాక్టరీలకు మాత్రం అంతర్జాతీయ మార్కెట్ ధరలను (బల్క్ రేట్లు) వసూలు చేస్తున్నాయి. ఈ ధరల తేడా వల్ల ఎక్కువ రేట్లకు విక్రయించే ప్రైవేట్ రంగానికి చెందిన నయారా, రిలయన్స్ వంటి బంకుల్లో అమ్మకాలు తగ్గిపోయి, తక్కువ రేటు ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) బంకుల్లో జనాలు పోటెత్తారు.ధరల వ్యత్యాసం కారణంగా గడచిన మే నెలలో దేశంలోని మూడు ప్రధాన ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం లలో ఇంధన విక్రయాలు రికార్డు స్థాయికి చేరాయి. సాధారణ రోజులతో పోలిస్తే పెట్రోల్ అమ్మకాలు 4.8 శాతం, డీజిల్ అమ్మకాలు ఏకంగా 6.4 శాతం మేర పెరిగాయి. ఈ విధంగా అకస్మాత్తుగా లోడ్ పెరగడం వల్ల సాధారణ ప్రజలకు ఇంధన సరఫరా ఆగిపోయే ప్రమాదం ఉందని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ గుర్తించింది. అందుకే రిటైల్ మార్కెట్‌ను కాపాడేందుకు తక్షణమే ఈ కొత్త ఆంక్షల ఉత్తర్వులను తెరపైకి తెచ్చింది.కేంద్ర ప్రభుత్వం విధించిన ఈ కొత్త నిబంధనలు, ఆంక్షలు తక్షణమే అమల్లోకి వస్తాయని, ఇవి ప్రాథమికంగా 90 రోజుల (మూడు నెలల) పాటు కొనసాగుతాయని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. బంకుల నుంచి తక్కువ ధరకు డీజిల్ కొని, దానిని మళ్లీ ఎక్కువ ధరకు ఇతరులకు రీ–సేల్ (పునర్విక్రయం) చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించింది. ఈ 90 రోజుల కాలంలో అంతర్జాతీయంగా పశ్చిమాసియా పరిస్థితులను, దేశీయ సరఫరా గొలుసును నిరంతరం పర్యవేక్షిస్తామని.. ఒకవేళ అప్పటికీ పరిస్థితులు సద్దుమణగకపోతే ఈ ఆంక్షల గడువును మరింత కాలం పొడిగిస్తామని కేంద్రం ప్రకటించింది.

ప్రస్తుతం ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలలో రగులుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు , యుద్ధ వాతావరణం కారణంగానే ఈ కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని కేంద్రం సమర్థించుకుంది. అంతర్జాతీయంగా చమురు రవాణా చేసే షిప్పింగ్ లాజిస్టిక్స్ మార్గాలపై దాడులు జరగడం, సముద్ర రవాణా ఖర్చులు పెరగడం వల్ల ఇంధన లభ్యతపై ప్రతికూల ప్రభావం పడిందని వివరించింది. దేశీయంగా ఎలాంటి ఆకస్మిక ఇంధన కొరత లేదా దేశవ్యాప్త ఎమర్జెన్సీ ఏర్పడకుండా ఉండాలంటే ఇలాంటి ముందస్తు క్రమశిక్షణా చర్యలు అత్యంత ఆవశ్యకమని చమురు రంగ నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు.కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఈ అత్యవసర ఉత్తర్వులను క్షేత్రస్థాయిలో వంద శాతం పక్కాగా అమలు చేయాలని దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్ర పెట్రోలియం శాఖ ఆదేశించింది. కొంతమంది ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని డీజిల్, పెట్రోల్‌ను అక్రమంగా నిల్వ చేయడం (హోర్డింగ్), బ్లాక్ మార్కెటింగ్‌కు తరలించడం, నిబంధనలకు విరుద్ధంగా ఇంధనాన్ని పరిశ్రమలకు మళ్లించడం వంటి చర్యలకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించింది. నిరంతర నిఘా ఉంచి దేశవ్యాప్తంగా సామాన్యుడికి నిరంతరాయంగా ఇంధనం అందేలా చూడాలని, మళ్లింపులు జరిగితే బంకుల లైసెన్సులు రద్దు చేయాలని స్పష్టం చేసింది.

# దేవాదాయశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, అర్చకులు, ఇతర సిబ్బందికి దక్కాల్సిన ప్రయోజనాలు, హక్కులు సంపూర్ణంగా దక్కుతాయి

**అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 12:**



కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలన దేవాదాయశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు,అర్చకులు, ఇతర సిబ్బందికి దక్కాల్సిన ప్రయోజనాలు, హక్కులు సంపూర్ణంగా దక్కుతాయని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ గారు అన్నారు. ఈ రోజు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1 కార్యనిర్వహణ అధికారులుగా పదోన్నతి పొందిన 26 మంది ఈవోలకు ప్రమోషన్ ఉత్తర్వుల అందజేత కార్యక్రమం మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ గారి ఆధ్వర్యంలో జరిగింది. అలాగే రాష్ట్రంలోని అర్చకులు, ఇతర ఉద్యోగులకు ఉద్దేశించిన 'అర్చక, ఇతర ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్టు' ద్వారా రిటైర్మెంట్ గ్రాట్యుటీ, ఉపనయనం గ్రాంట్, ఇంటి నిర్మాణ పథకం, విద్యా పథకం తదితర సంక్షేమ పథకాల ప్రయోజనాల పెంపు వివరాలను వారి హర్షధ్వానాల మధ్య మంత్రి గారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ వి.హన్మంతరావు, పలువురు ఈవోలు, తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జెఎసి కన్వీనర్ డివిఆర్ శర్మ, అర్చక సంఘాల ప్రతినిధులు, పలువురు ఉద్యోగులు, అర్చకుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ఈవోల ప్రమోషన్లను ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని అన్నారు. నిబంధనల ప్రకారం వారికి దక్కాల్సని ప్రయోజనాలు దక్కి తీరాలన్న లక్ష్యంతో ఈవోల పదోన్నతుల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా ఏడు జోన్ల పరిధిలో గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1 కార్యనిర్వహణ అధికారులుగా పదోన్నతి పొందిన 26 మంది ఈవోలకు ప్రమోషన్ ఉత్తర్వులను తన స్వహస్తాలతో అందించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు, అర్చకులు సంతృప్తిగా వుంటేనే వారు నిబద్ధతతో పనిచేస్తారని ప్రజా ప్రభుత్వం విశ్వసిస్తుందని అన్నారు. త్వరలో ఎసి నుంచి డిసి ప్రమోషన్లు, ఈవోల ప్రమోషన్లు చేపట్టనున్నట్టు మంత్రి సురేఖ తెలిపారు. దేవాలయాల నిర్వహణను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈవోల కోరిక మేరకు దేవాలయాల నిర్వహణ కోసం అదనపు సిబ్బంది నియమిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ దిశగా కార్యాచరణను ప్రారంభించాలని కమిషనర్ వి. హన్మంతరావుకు మంత్రి సురేఖ సూచించారు.

అర్చకులు, ఇతర సిబ్బందికి 'అర్చక, ఇతర ఉద్యోగుల సంక్షేమ నిధి' ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆర్థిక ప్రయోజనాలు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెంచినప్పటికీ, ఆ ప్రయోజనాలు వారి అవసరాలు తీర్చడం లేదనే ఆలోచనతో మరోమారు పెంచినట్లు మంత్రి సురేఖ ప్రకటించారు. పెంచిన మొత్తాలను ఏప్రిల్ 1, 2026 నుంచే అమల్లోకి వచ్చాయని మంత్రి స్పష్టం చేశారు. అర్చకులు సంతోషంగా, సంతృప్తిగా వుంటేనే వారు చూపే ఆదరణతో భక్తులకు మంచి జరుగుతుందని, పూజలు ఫలిస్తాయని మంత్రి అన్నారు. పథకాల ప్రయోజనాల అమలుకు త్వరలో వెబ్సైట్ తో పాటు యాప్ ను అందుబాటులోకి తేవాలని, దీని ద్వారా వారికి ప్రయోజనాలు సులభంగా అందుతాయని మంత్రి సురేఖ కమిషనర్ హన్మంతరావుకు ఆదేశాలిచ్చారు. గ్రీన్ ఛానల్ ద్వారా ఆర్థిక ప్రయోజనాలు ప్రత్యక్షంగా అర్చకుల బ్యాంకు ఖాతాల్లో పడేలా డిజిటల్ వ్యవస్థను తీసుకురావాలని సూచించారు. ఈ వర్షాకాలం సీజన్ లో దేవాలయాలు పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచేలా చెట్లు నాటే కార్యక్రమాన్ని విరివిగా చేపట్టాలని మంత్రి సురేఖ కమిషనర్ కు సూచించారు. ఈవోలు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది అంతా కలిసి ఈ కార్యక్రమాన్ని బాగా నిర్వహించాలని ఆదేశించారు. సుదీర్ఘకాలంగా పెండింగ్ లో వున్న తమకు గ్రేడ్ 1 ఈవోలుగా పదోన్నతి పొందటంతో వారు వారి హర్షాతిరేకాలకు సెక్రటేరియట్ లోని మంత్రి సురేఖ గారి కార్యాలయం వేదికగా నిలిచింది. ఇప్పటికే అర్చక,ఇతర ఉద్యోగుల సంక్షేమ నిధి ద్వారా అందుతున్న ప్రయోజనాలతో సంతోషాల్లో మునిగితేలుతున్న అర్చకులు, మరోసారి ప్రయోజనాల పెంపుతో భావేద్వాగానికి లోనయ్యారు. ప్రజా ప్రభుత్వం తమ పై వరాల జల్లు కురిపించిందని ఆనంద భాష్పాలు రాల్చారు. ఎంతో ఉత్సాహంగా సాగిన ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ గారిని ఉద్యోగులు, అర్చకులు అభినందలతో ముంచెత్తారు. దేవాదాయ శాఖ ఉన్నతికి, ఉద్యోగులు, అర్చకులు సంక్షేమమే లక్ష్యంగా సునిశిత దృష్టితో పనిచేస్తున్న మంత్రి కొండా సురేఖ గారి పేరు దేవాదాయ శాఖ చరిత్రలో అజరామరంగా నిలుస్తుందని వారు భావోద్రిక్తులయ్యారు.

# 190 జీవో అమలుపై ప్రభుత్వం నిర్లక్ష్యం..

- ఉద్యోగులకు అన్యాయం: తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత
- నిర్ణయాలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకంజ వేస్తోందన్న విమర్శ
- కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపణ
- 317 జీవో సవరణగా తీసుకొచ్చిన 190 జీవో అమలుకు నోచుకోలేదన్న ఆవేదన
- తొమ్మిది నెలలు గడిచినా అమలులో పురోగతి లేదని వ్యాఖ్య
- టీచర్లు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- స్వస్థలాలకు పంపిస్తామన్న హామీలు గాలికొదిలేశారన్న విమర్శ
- సూపర్ న్యూమరీ పోస్టుల ఏర్పాటు హామీ అమలుకాలేదన్న ఆరోపణ
- 190 జీవోకు రేషనలైజేషన్‌తో



తెలంగాణలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రక్షణ సేన విమర్శించింది. ఏ అంశంపై నిర్ణయం తీసుకోవాలన్నా ప్రభుత్వం గుండె ధైర్యం చూపకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని ఆరోపించింది.317 జీవో వల్ల తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ సిఫారసుల మేరకు 317 జీవోకు సవరణగా 190 జీవోను తీసుకొచ్చిందని గుర్తు చేసింది. అయితే జీవో విడుదలై దాదాపు తొమ్మిది నెలలు గడిచినా ఇప్పటి వరకు అమలులో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని పేర్కొంది.317 జీవో కారణంగా ఎక్కువగా ఉపాధ్యాయులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రక్షణ సేన తెలిపింది. బాధితులను వారి స్వస్థలాలకు పంపిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అవసరమైతే సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించి సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించిందని గుర్తు చేసింది.అయితే ఆ హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. 190 జీవో అమలు గడువు పరిమితమైనదేనని, అయినప్పటికీ ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగిని కూడా బదిలీ చేయలేదని ఆరోపించింది.జీవో 25 కింద చేపడుతున్న రేషనలైజేషన్ ప్రక్రియకు, 190 జీవో అమలుకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. రేషనలైజేషన్‌ను సాకుగా చూపకుండా ప్రభుత్వం వెంటనే 190 జీవోను అమలు చేయాలని డిమాండ్ చేసింది. అవసరమైతే సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సూచించింది.ఉద్యోగులు, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొంది. ప్రభుత్వం వెంటనే 190 జీవో అమలుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమ కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించింది. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేసింది.

# గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

**హైదరాబాద్ వెలుతురు జూన్ 12:**

గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్ గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ, సరికొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో 'ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం'ను చిత్తశుద్ధితో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్(ఎఫ్ టీసీసీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్ఐసీసీ నోవాటెల్ లో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఎగుమతుల సన్నద్ధత సూచీలో దేశవ్యాప్తంగా తెలంగాణ ఎనిమిదో స్థానంలో నిలిచిందన్నారు. అదే... సముద్ర తీరం లేని రాష్ట్రాల (ల్యాండ్‌లాక్డ్) జాబితాలో రెండో స్థానంలో ఉందన్నారు. మర్చండైజ్ ఎగుమతుల్లో దేశంలోనే ఏడో స్థానంలో నిలవడం తెలంగాణ పారిశ్రామిక వృద్ధికి నిదర్శనమన్నారు.

'తెలంగాణ రైజింగ్ – 2047' విజన్ లక్ష్యసాధనలో 'లాజిస్టిక్స్' రంగం కీలక పాత్ర పోషించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. తెలంగాణకు సముద్ర తీరం లేకపోవడాన్ని ఒక పరిమితి(లిమిటేషన్)గా కాకుండా, ఒక డిజైన్ అడ్వాంటేజ్ గా మార్చుకుంటున్నామన్నారు. 'లాజిస్టిక్స్ పాలసీ 2.0' ద్వారా రాష్ట్రంలో మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్, డ్రై పోర్టులు, బాండెడ్ వేర్ హౌజింగ్, లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేయబోతున్నామన్నారు. లాజిస్టిక్ రంగానికి అవసరమైన రెడీ టూ స్కిల్డ్ వర్క్ ఫోర్స్ తయారీకి అత్యంత ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్ ను లాజిస్టిక్ రంగంలోనూ సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నామన్నారు. మల్టీ మోడల్ లాజిస్టిక్స్, రైల్ లింక్డ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఎయిర్ కార్గో, కోల్డ్ చైన్, గ్రేడ్ – ఏ వేర్ హౌజింగ్, ఆటోమేషన్, డిజిటల్ లాజిస్టిక్ ప్లాట్ ఫామ్స్, గ్రీన్ మొబిలిటీ తదితర రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్ టీసీసీఐ ప్రెసిడెంట్ ఆర్.రవి కుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కేకే మహేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గరిమెళ్ల, షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ కమిటీ చైర్మన్ కమల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ పుష్కర పాలన ...

(మొదటి పేజీ తరువాయి)

కరీంనగర్ జగిత్యాలకు నిధులు మంజూరు చేశారు. 12 లక్షల ఉద్యోగాలిచ్చారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు పెద్ద ఎత్తున పైసలిస్తున్నారు. ఆ నిధులతోనే గ్రామాలు, పట్టణాల అభివృద్ధి చెందుతున్నాయి''అని వివరించారు. ''దేశంలో 4 వేల రోజులకుపైగా పాలన కొనసాగిస్తున్న ఏకైక ప్రధాని మోదీ. ఆయన నిరంతరం పేదల కోసమే పనిచేస్తున్నారు. పేదల పాలిట దేవుడు నరేంద్రమోదీ. ఆటో డ్రైవర్ గా నువ్వు రోజు కనీసం వంద మందినైనా కలుస్తుంటావ్. రాజకీయాలకు అతీతంగా మోదీ ఈ దేశానికి చేస్తున్న మంచి పనులను చెప్పాలి. మోదీగారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉంటూ దేశానికి మరింత సేవ చేయాలని కోరుకుందాం''అని చెప్పారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలనపైనా బండి సంజయ్ ఆరా తీశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపట్ల అసంతృప్తితో ఉన్నారంటూ ఆటో డ్రైవర్ బదులిచ్చారు. ఏ వర్గాలు ఎక్కువగా కోపంగా ఉన్నాయని అడిగితే ''మా ఆటో ఎక్కే వాళ్లలో మహిళలు, వృద్ధులు కాంగ్రెస్ ప్రభుత్వంపై కోపంగా ఉన్నారు''అని పేర్కొనడం గమనార్హం. మోదీ పాలనను ప్రస్తావించగా 'యువకులు, మహిళలంతా మోదీ పాలన బాగుందంటున్నారు. నేను కూడా మోదీ అభిమానినే''అని బదులివ్వడం విశేషం.

రేగొండ నుండి చిగురు మామిడి వరకు ఆటోలో ప్రయాణించిన బండి సంజయ్ అనంతరం చిగురుమామిడిలో దిగారు. మోదీ 12 ఏళ్ల పాలనా విజయాలకు సంబంధించిన పుస్తకాలను ఆటో డ్రైవర్ దిలీప్ కు అందజేశారు. మోదీ పాలనా విజయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

# జాతీయ రహదారి...

(మొదటి పేజీ తరువాయి)

రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ అవసరమైన సూచిక బోర్డులు, హెచ్చరిక సంకేతాలు ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే జాతీయ రహదారికి ఇరువైపులా పచ్చదనం పెంపొందించేందుకు అటవీ శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు.జాతీయ రహదారి నిర్మాణ పనుల పురోగతిపై ప్రతి వారం వారీగా నివేదికలు సమర్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులో పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఈ సమీక్షా సమావేశంలో నేషనల్ హైవేస్ అథారిటీ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాస్త్రవేత్తకు లక్ష రూపాయల...

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు మరియు "భారతదేశంలో వ్యవసాయ పరిశోధన, విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో హరిత విప్లవానికి దివంగత శ్రీమతి ఇందిరా గాంధీ చేసిన విశిష్ట సేవలు" అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు సందర్భంగా 12 జూన్ 2026న జరిగింది.ఈ కార్యక్రమానికి భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, బెంగళూరులోని భారతీయ గణాంక సంస్థ (Indian Statistical Institute) ప్రొఫెసర్ మధుర స్వామినాథన్, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి హాజరై కార్యక్రమాన్ని శోభాయమానం చేశారు.వ్యవసాయ శాస్త్రాల రంగంలో ప్రతిభను ప్రోత్సహించడం, అర్హులైన విద్యార్థులకు తోడ్పాటు



అందించడం పట్ల ఫౌండేషన్ యొక్క నిబద్ధతకు ఈ కార్యక్రమం నిదర్శనం. వ్యవసాయం అనేది డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారికి ఎంతో ప్రీతిపాత్రమైన అంశం. రైతుల సంక్షేమం మరియు వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ఆయన నిరంతరం కృషి చేశారు. వ్యవసాయ శాస్త్రాల్లో ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేయడం ఆయన దూరదృష్టికి, గ్రామీణ సమాజ సాధికారత కోసం విద్య మరియు వ్యవసాయాభివృద్ధి ద్వారా చేసిన సేవలకు తగిన నివాళిగా నిలుస్తుంది

# సద్ది తెచ్చుకుని స్థానికులతో కలిసి

- బువ్వ తింటూ... టిఫిన్ బైఠక్ లో పాల్గొన్న కేంద్ర మంత్రి
- హుస్నాబాద్ నియోజకవర్గం రేకొండ స్కూల్ క్లీన్ పై చర్చించిన బండి సంజయ్
- రాజకీయాలకు అతీతంగా స్కూల్ ను క్లీన్ చేయాలని కోరిన కేంద్ర మంత్రి
- ఎంపీ అయ్యాక సమాజసేవకే ప్రాధాన్యత నిస్తున్నానని వెల్లడి
- కరీంనగర్ ఎంపీ సెగ్మెంట్ లోని స్కూళ్లలో టిఫిన్ బైఠక్ నిర్వహించిన కార్యకర్తలు

**హుస్నాబాద్ వెలుతురు జూన్ 12:**





కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం రోజున కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం చిగురు మామిడి మండలం రేకొండ గ్రామ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ''స్వచ్ఛ పాఠశాల'' కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో కలిసి పాఠశాల ఆవరణలో ''టిఫిన్ బైఠక్'' నిర్వహించారు. అక్కడికి వచ్చిన గ్రామస్తులు, కార్యకర్తలంతా తమ వెంట సద్ది తెచ్చుకుని రాగా బండి సంజయ్ సైతం స్వయంగా ఇంటి నుండి తెచ్చుకున్న టిఫిన్ క్యారియన్ ఓపెన్ చేసి వారితో కలిసి అల్పాహారం తిన్నారు. ఈ సందర్భంగా రేకొండ స్కూల్ తరగతులను శుభ్రం చేసే అంశంపై చర్చించారు. పేదల చదువుల నిలయమైన ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుంటూ శుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యతని చెప్పారు. అందులో భాగంగా మోదీ పిలుపు మేరకు రాజకీయాలకు అతీతంగా స్కూల్ ను క్లీన్ చేయాలని కోరారు. ఈనెల 16న ప్రతి గ్రామంలో పిల్లలంతా బడిలో చేరాలంటూ... ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఎంపీ అయ్యాక తాను సమాజ సేవకే ప్రాధాన్యతనిస్తున్నానని వెల్లడించారు. ఈ సందర్భంగా స్కూల్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు డైనింగ్ సౌకర్యం లేదని, పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల సమస్య ఉందని ఈ సందర్భంగా టీచర్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల డైనింగ్ కోసం రూ.5 లక్షల సాయం చేస్తానని హామీ ఇచ్చారు. అట్లాగే ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి, కుల సంఘాల భవన నిర్మాణానికి రూ.20 లక్షల సాయం చేస్తానని తెలిపారు. తొలి విడతగా రూ.10 లక్షలు అందిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం స్కూల్ లోని తరగతి గదుల తోపాటు డైనింగ్ హాలును కూడా సందర్శించారు. స్కూల్ విద్యార్థులతో ముచ్చటించారు. టెన్త్ అత్యధిక మార్కులు సాధించిన రేకొండ స్కూల్ విద్యార్థులను అభినందించడం తోపాటు వారితో కలిసి ఫోటో దిగారు. ఈసారి కూడా ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ చదివే విద్యార్థుందరికీ ఉచితంగా సైకిళ్లు అందిస్తానని ప్రకటించారు. మోదీ పాలనా విజయాల బుక్ లెట్లను ఈ సందర్భంగా హెడ్మాస్టర్ కు అందించారు. మోదీ 12 ఏళ్ల పాలనా విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు మేరకు ఈరోజు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని దాదాపు అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో బీజేపీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి టిఫిన్ బైఠక్ నిర్వహించారు. ఎవరికి వారే తమ వెంట అల్పాహారం క్యారియర్ లను తెచ్చుకుని పాఠశాల ఆవరణలో కూర్చుని తిన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల తరగతులను పరిశీలించి... ''స్వచ్ఛ పాఠశాల''లో భాగంగా వాటిని క్లీన్ చేసేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకున్నారు. రేపు ఉదయం వారంతా తమ తమ గ్రామాల్లోని పాఠశాలలను శుభ్రం చేయనున్నారు. అందుకోసం సొంతంగా చీపురు, క్లాత్, బకెట్ ను కూడా వెంట తెచ్చుకోనున్నారు. మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ సైతం ''స్వచ్ఛ పాఠశాల''లో భాగంగా సరిసిల్ల జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. స్వయంగా చీపురు, క్లాత్, బకెట్ వెంట తెచ్చుకుని అక్కడికి వచ్చిన కార్యకర్తలు, స్థానికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి తరగతి గదులను శుభ్రం చేయనున్నారు. అనంతరం సిరిసిల్ల పట్టణంలో కొంత మంది ప్రభావ శీలుర(ఇన్ ఫ్లూయన్సర్స్) ను కలిసి మోదీ 12 ఏళ్ల పాలనా విజయాలకు సంబంధించిన పుస్తకాలను బండి సంజయ్ అందజేయనున్నారు.

# బిజెపి జెబు సంస్థగా మారిన ఈసీ

**రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 12:**



రాజ్యసభ ఎన్నికల ప్రక్రియలో శ్రీమతి మీనాక్షి నటరాజన్ గారి నామినేషన్ తిరస్కరణ దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఆందోళనకర పరిణామమని, ఇది భారత ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యగా భావించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు.భారత ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాంగ సంస్థగా వ్యవహరించాల్సిన సమయంలో, కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభావానికి లోనై పనిచేస్తోందనే అనుమానాలను ఈ సంఘటన మరింత బలపరుస్తోందని ఆయన అన్నారు. గత కొన్నేళ్లుగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై ప్రజలకు వివరణాత్మకంగా వివరించారని, ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై అనేక ప్రశ్నలు లేవనెత్తారని గుర్తు చేశారు.మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల సందర్భంగా సంఖ్యాబలం తక్కువగా ఉన్నప్పటికీ బీజేపీ మూడో అభ్యర్థిని బరిలోకి దింపడం, అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి శ్రీమతి మీనాక్షి నటరాజన్ గారి నామినేషన్ తిరస్కరణ జరగడం యాదృచ్ఛికం కాదని ఆయన ఆరోపించారు. ఎన్నికల అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ నిర్ణయం తీసుకునేలా చేశారని కాంగ్రెస్ పార్టీ భావిస్తోందన్నారు.దేశ స్వాతంత్ర్యానంతరం ఎన్నో దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, రాజకీయ ప్రత్యర్థులను సంస్థాగత శక్తులను దుర్వినియోగం చేసి అణచివేసే ప్రయత్నం ఎప్పుడూ చేయలేదని ఆయన పేర్కొన్నారు. ఈరోజు మాత్రం సీబీఐ, ఈడీ, ఎన్నికల సంఘం వంటి సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో పెరుగుతోందన్నారు.ప్రజాస్వామ్యంలో రాజకీయ పోరాటం ఎన్నికల ద్వారానే జరగాలని, కానీ ప్రత్యర్థులను పరిపాలనా వ్యవస్థల ద్వారా అడ్డుకునే ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు. దేశంలోని మేధావులు, యువత, ప్రజాస్వామ్యవాదులు ఈ పరిణామాలపై ఆలోచించాలని పిలుపునిచ్చారు.రామరాజ్యం పేరుతో రాజకీయాలు చేస్తున్నవారు నిజంగా ధర్మం, న్యాయం, పారదర్శకత విలువలను పాటిస్తున్నారా అనే ప్రశ్నకు దేశ ప్రజలే సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. మహాభారతంలో చివరికి ధర్మమే విజయం సాధించినట్లే, ప్రజాస్వామ్య వ్యవస్థలో కూడా సత్యం, న్యాయం, ప్రజల సంకల్పమే అంతిమంగా గెలుస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.దేశ నిర్మాణానికి గత దశాబ్దాలుగా వివిధ ప్రభుత్వాలు చేసిన కృషిని ప్రజలు సమగ్రంగా పరిశీలించాలని, కేవలం ప్రచారాల ఆధారంగా కాకుండా వాస్తవాల ఆధారంగా తమ రాజకీయ నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు. భవిష్యత్ ఎన్నికల్లో ప్రజలు ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించే శక్తులకు మద్దతు ఇస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ శక్తిగా ఎదుగుతోంది: డీకే అరుణ

- వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కేంద్రం వేగంగా అడుగులు
- అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తున్న ప్రధాని మోదీ
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ స్థానం మరింత బలోపేతం
- జాతీయ భద్రత విషయంలో రాజీలేని వైఖరి అవలంబిస్తున్న కేంద్రం
- స్వచ్ఛ భారత్ నుంచి ఆర్టికల్ 370 రద్దు వరకు కీలక సంస్కరణలు
- మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రత్యేక కార్యాచరణ
- 2030 నాటికి 3 కోట్ల మంది మహిళలను లఖ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దే లక్ష్యం
- రైతు సంక్షేమానికి కేంద్రం భారీ ప్రాధాన్యం
- పీఎం కిసాన్, సుకన్య సమృద్ధి వంటి పథకాలతో లబ్దిదారులకు భరోసా
- దేశ అభ్యున్నతే ప్రధాని మోదీ ధ్యేయమన్న ఎంపీ



**హైదరాబాద్ వెలుతురు జూన్ 12:**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతూ ప్రపంచ వేదికపై తన ప్రభావాన్ని మరింత పెంచుకుంటోందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. 2047 నాటికి దేశాన్ని 'వికసిత్ భారత్'గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కార్యాచరణను అమలు చేస్తోందని తెలిపారు.మీడియాతో మాట్లాడిన డీకే అరుణ, స్వాతంత్ర్య శతాబ్ది వేడుకల నాటికి అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్‌ను నిలబెట్టాలనే దృఢ సంకల్పంతో ప్రధాని మోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. దేశ ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, జాతీయ భద్రత వంటి అంశాలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నారని కొనియాడారు.గత పదేళ్లలో భారత్ సాధించిన ఆర్థిక పురోగతి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించిందని ఆమె అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, పారదర్శక పాలన, మౌలిక వసతుల అభివృద్ధి ఫలితంగానే దేశం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని తెలిపారు.దేశ భద్రత విషయంలో కేంద్రం రాజీపడే ప్రసక్తే లేదని డీకే అరుణ స్పష్టం చేశారు. సరిహద్దుల రక్షణ, ఉగ్రవాద నిర్మూలన, అంతర్గత భద్రత బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. దేశ సమగ్రతను కాపాడేందుకు అవసరమైన ప్రతి చర్యను ప్రభుత్వం చేపడుతోందని చెప్పారు.ప్రధాని మోదీ పాలనలో అమలైన పలు కీలక కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, స్వచ్ఛ భారత్ అభియాన్, జన్‌ధన్ యోజన, జీఎస్టీ, త్రిపుల్ తలాక్ రద్దు, ఆర్టికల్ 370 రద్దు వంటి నిర్ణయాలు దేశ చరిత్రలో మైలురాళ్లుగా నిలిచాయని అన్నారు. ఈ నిర్ణయాలు దేశ పరిపాలనా వ్యవస్థలో, సామాజిక రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయని పేర్కొన్నారు.మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డీకే అరుణ తెలిపారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాల కల్పన ద్వారా మహిళలను స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని చెప్పారు. 2030 నాటికి 3 కోట్ల మంది మహిళలను 'లఖ్‌పతి దీదీలు', 'కరోడ్‌పతి దీదీలు'గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తోందని వెల్లడించారు.రైతుల సంక్షేమం కోసం కూడా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, పంటల బీమా, ఎరువుల సబ్సిడీ వంటి పథకాల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. రైతులకు ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.24 వేల వరకు ఎరువుల సబ్సిడీ రూపంలో ప్రయోజనం అందుతోందని వివరించారు.దేశాన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే క్రమంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని డీకే అరుణ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ చూపిస్తున్న మార్గదర్శకత్వంలో భారత్ ప్రపంచ అగ్రదేశాల సరసన నిలిచే రోజు దూరంలో లేదని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఎస్సీ ఎస్టీ కేసులపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి

- మంత్రి వాకిటి శ్రీహరి

**నారాయణ పేట వెలుతురు జూన్ 12:**

నారాయణ పేట జిల్లాలో ఎస్సీ ఎస్టీ కేసుల గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి మత్స్య క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశించారు. శుక్రవారం నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ లో షెడ్యూల్ కులాలు తెగల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రియాంక అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..కులం అనే విద్వేషాన్ని రూపు మాపాలన్నారు. జిల్లాలో ఎస్సీ,ఎస్టీ కేసులపై అవగాహన కల్పించి కేసులకు అవకాశం లేకుండా చూడాలని సూచించారు. చనిపోయిన తర్వాత వచ్చే నష్ట పరిహారం కంటే బతికి ఉన్నప్పుడు ఉండే భరోసా కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇస్తుందన్నారు. జిల్లాలో ప్రజలకు చట్టంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. కులం విషయంలో అవమాన పడ్డ వ్యక్తిగా తాను కుల విద్వేషాలను వ్యతిరేకిస్తున్నానని తెలిపారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో బాధితులకు పెండింగ్ లో ఉన్న నష్ట పరిహారం బడ్జెట్ ను ఆ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తో మాట్లాడి మంజూరు చేయిస్తా అని మంత్రి వాకిటి శ్రీహరి హామీనిచ్చారు . విద్యా వ్యవస్థలో ఇంకా మార్పు రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. జిల్లాలో ఇంకా బహిర్భూమికి వెళ్ళే పరిస్థితి పోవాలని ,అందరికీ మరుగుదొడ్లు మంజూరు చేయించాలని కలెక్టర్ కు సూచించారు. జిల్లాలో అన్ని గ్రామాలు, గిరిజన తండాలకు బీటీ రోడ్లు మంజూరు చేస్తామని మంత్రి వెల్లడించారు. గిరిజన తండాలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ను, 25 ఇండ్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. జిల్లాలో పోలీసు శాఖ నిర్వహిస్తున్న సివిల్ రైట్ డే, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉల్లాస్ కార్యక్రమాలను మంత్రి ప్రశంసించారు . జిల్లాకు ఇంకా రావాల్సిన హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ లను, జిల్లా అధికారులను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకు వస్తామని మంత్రి పేర్కొన్నారు. ఇరిగేషన్, ఎడ్యుకేషన్, హెల్త్, ట్రాన్స్ పోర్ట్ టెషన్ కు అధిక ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ వెంకట్ రాములు, డీఎస్పీ లింగయ్య , ఆర్డీవో రమేష్, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కాంత్ కుమార్, ట్రైబల్ అధికారి జనార్దన్, పీ ఆర్ ఈ ఈ అశోక్, పుర కమీషనర్ శంకర్, కమిటీ సభ్యులు కిష్టా నాయక్, బొట్టు రవి, తదితరులు పాల్గొన్నారు.



# జీవో 190ని వెంటనే అమలు చేయాలి.. లేదంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన: కవిత హెచ్చరిక

- జీవో 317 బాధితులకు న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర జాప్యం
- కమిటీల పేరుతో కాలయాపన.. జీవో తెచ్చి 9 నెలలైనా ఒక్క బదిలీ కూడా చేయలేదు
- ఉద్యోగులు, ఉపాధ్యాయులను స్వస్థలాలకు పంపాలి.. అవసరమైతే సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించాలి
- జీవో 25 రేషనలైజేషన్‌తో సంబంధం లేకుండా జీవో 190ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్

**హైదరాబాద్, వెలుతురు జూన్ 12:**

జీవో 317 కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగించేలా తీసుకొచ్చిన జీవో 190ని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉధృత ఆందోళనకు శ్రీకారం చుడతామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కే. కవిత హెచ్చరించారు. శుక్రవారం ఆమె విడుదల చేసిన ఒక వీడియో ప్రకటనలో.. జీవో 317 బాధితులకు సహాయం అందించడంలో ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తోందని మండిపడ్డారు. కీలక నిర్ణయాలు తీసుకునే ధైర్యం లేకనే, ప్రభుత్వం కేవలం కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ బాధితులను వంచిస్తోందని ఆమె ఆరోపించారు.

జీవో 317 సమస్యల పరిష్కారం కోసం మంత్రులు దామోదర రాజనర్సింహ, డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కూడిన కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారని, ఆ కమిటీ సిఫార్సుల మేరకు తాత్కాలిక ఉపశమనంగా జీవో 190ని ప్రభుత్వం తీసుకొచ్చిందని కవిత గుర్తుచేశారు. అయితే, ఈ ఉత్తర్వులు జారీ చేసి దాదాపు 9 నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు దీనిని క్షేత్రస్థాయిలో అమలు చేయకపోవడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ఆమె ప్రశ్నించారు. ఎవరి ప్రయోజనాలను కాపాడటం కోసం ఈ జీవో అమలును నిలిపివేశారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

జీవో 317 బాధితులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేస్తామని, అవసరమైన చోట సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించి సర్దుబాటు చేస్తామని నాడు హామీ ఇచ్చారని కవిత నిలదీశారు. ఈ జీవో కాలపరిమితి కేవలం మూడు సంవత్సరాలు మాత్రమేనని, కానీ ఇంతవరకు ఒక్క ఉద్యోగిని లేదా ఉపాధ్యాయుడిని కూడా బదిలీ చేయకపోవడం దారుణమన్నారు. జీవో 25 పరిధిలో జరిగే రేషనలైజేషన్ (హేతుబద్ధీకరణ) ప్రక్రియతో అస్సలు సంబంధం లేకుండా జీవో 190ని స్వతంత్రంగా అమలు చేయాలని, ఇందుకోసం ఉద్యోగ సంఘాలు కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల హక్కుల కోసం తెలంగాణ రక్షణ సేన అండగా నిలబడి పోరాడుతుందని, ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని కవిత హెచ్చరించారు.



# చారిత్రక పాలన... పరిణామాత్మక నాయకత్వం

భారత ప్రజాస్వామ్య చరిత్రలో 2026 జూన్ 10న ఓ కొత్త అధ్యాయం పూర్తయింది. శ్రీమాన్ నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానమంత్రిగా 4,399 రోజుల నిరంతరాయ పాలన ద్వారా ఆ తేదీ నాటికి చరిత్ర సృష్టించారు. అత్యంత సుదీర్ఘకాలం పదవిలో కొనసాగిన ప్రధానిగా నమోదైన ఈ రికార్డు దేశ పురోగమనంపై ఆయన అచంచల నిబద్ధతను చాటిచెబుతోంది. ప్రజా సంక్షేమం, వారి ఆకాంక్షలపై ఆయన స్థిరమైన అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుంది. అలాగే, దూరదృష్టి గల ఆయన నాయకత్వంపై దేశ ప్రజల చెక్కు చెదరని నమ్మకాన్ని, విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది.

**పరిణామాత్మక నాయకత్వానికి 4,399 రోజులు పూర్తి... కొనసాగింపు**

సుపరిపాలనతోపాటు 'దేశమే ప్రధానం' అనే సూత్ర నిబద్ధతగల ప్రధాన సేవకుడుగా శ్రీమాన్ నరేంద్ర మోదీ దేశంలో అసాధారణ రూపాంతరీకరణ శకానికి నాంది పలికారు. ఒకనాడు అత్యంత అమానుష బానిసత్వ పీడనను నిర్మూలించి, లక్షలాది ప్రజానీకం ఆత్మగౌరవంతో జీవించేలా చేసిన అబ్రహం లింకన్ నాయకత్వ పటిమను మానవాళి చరిత్ర నేటికీ గౌరవిస్తున్నది. అదే తరహాలో 25 కోట్ల మందికి పైగా ప్రజలను దుర్భర పేదరికం నుంచి విముక్తం చేసిన శ్రీ నరేంద్ర మోదీని కూడా భవిష్యత్తరాలు స్మరించుకుంటాయి. ఆయన దార్శనికత, అవిరళ కృషి, పరిణామాత్మక పాలన వల్ల అసంఖ్యాక కుటుంబాలకు అవకాశాలు అందివచ్చాయి. ఆత్మగౌరవం, ఆకాంక్షలకు సాధికారత సహా ఆర్థిక స్వేచ్ఛ, మెరుగైన భవిష్యత్తుకు భరోసా లభించింది. మానవాళి సేవలో ఆయన కృషి ఓ కీలక ఘట్టంగా చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది.మరోవైపు ఆయన చేపట్టిన వినూత్న కార్యక్రమాలు విద్య, గృహవసతి, పారిశుధ్యం, ఆరోగ్య సంరక్షణ, ఆహార భద్రత తదితరాల ద్వారా లక్షలాది ప్రజలకు గౌరవాన్ని, సామాజిక భద్రతను కల్పించాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజారోగ్య కార్యక్రమాలలో ఒకటైన ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా 44 కోట్ల మందికి పైగా పౌరులకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ భరోసా లభించింది. అలాగే, జల్ జీవన్ మిషన్ ద్వారా 12 కోట్లకు పైగా గ్రామీణ కుటుంబాలకు నేడు సురక్షిత, విశ్వసనీయ తాగునీటి సరఫరా సదుపాయం కలిగింది. బిందెడు నీటికోసం బండెడు దూరం నడిచే ప్రయాస తప్పి.. ముఖ్యంగా మహిళలకు జీవన నాణ్యత మెరుగుపడింది. అంతేగాక 2020 నుంచి ఉచితంగా ఆహార ధాన్యాల నిరంతర పంపిణీతో దాదాపు 80 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత లభించడం వల్ల దుర్బల వర్గాలు వెనుకబాటు నుంచి విముక్తమయ్యాయి. దేశవ్యాప్తంగా 4 కోట్లకు పైగా కుటుంబాలకు సురక్షిత, శాశ్వత సొంత ఇంటి కల సాకారమైంది. ఇది వారిలో భద్రత భావాన్ని, గౌరవాన్ని కలిగించి, భవిష్యత్తుపై ఆశలు చిగురించేలా చేసింది. ప్రతి భారతీయుడి సంక్షేమం దిశగా ఆయన తిరుగులేని నిబద్ధతకు, మానవీయ దృక్పథ సహిత పాలనకు ఈ కార్యక్రమాలన్నీ శాశ్వత ప్రతీకలుగా నిలుస్తాయి.సమాజంలోని ప్రతి వర్గం– మహిళలు, యువత, రైతులు, అణగారిన వర్గాల ప్రజానీకం మొత్తానికీ ప్రధాని మోదీ దార్శనికత సాధికారత నిచ్చింది. దేశవ్యాప్తంగా 3 కోట్ల మందికి పైగా మహిళలు లక్షాధికారులుగా ఆవిర్భవించడం, మహిళల సారథ్యంలో అభివృద్ధి సూత్రం ఆయన దార్శనికతకు ఒక శక్తిమంతమైన నిదర్శనం. నారీశక్తి అభ్యున్నతి దిశగా చేపట్టిన కార్యక్రమాలు దేశ పురోగమనంలో మహిళలు మరింత కీలక పాత్ర పోషించేలా తోడ్పడ్డాయి. కొత్త 'ఐఐటీ'లు, ఎయిమ్స్, వైద్య కళాశాలలు, ఉన్నత విద్యా సంస్థల స్థాపనతో భారత విద్యా, ఆరోగ్య సంరక్షణ రంగాలు గణనీయంగా విస్తరించి యువతరానికి అపార అవకాశాలను సృష్టించాయి.అదే సమయంలో అద్భుత మౌలిక సదుపాయాల విప్లవానికి యావద్దేశం సాక్ష్యంగా నిలిచింది. వందే భారత్ రైళ్లు, విమానాశ్రయాలు, రహదారులు, రైల్వే స్టేషన్ల సత్వర విస్తరణ తదితరాల నుంచి మారుమూల ప్రాంతాలకు అనుసంధానం కల్పించే వినూత్న ప్రాజెక్టుల దాకా ఓ ఆధునిక, అనుసంధానిత, ఆకాంక్షభరిత భారత్‌కు ఆయన నాయకత్వం పునాది వేసింది. ఈ విజయాలన్నీ దేశంలో ఆర్థిక వృద్ధిని వేగిరపరచడమే కాకుండా లక్షలాది పౌరుల జీవన నాణ్యతను కూడా మెరుగుపరిచాయి.డిజిటల్ ఆవిష్కరణలు, సెమీ–కండక్టర్ అంతరిక్ష సాంకేతికత, టీకాల రూపకల్పన, మొబైల్ తయారీ రంగాల్లో భారత్ ప్రపంచ అగ్రగామిగా రూపొంది, ఆధునిక సాంకేతికతల రీత్యా అంతర్జాతీయ స్థాయిని మరింత పెంచుకుంది.సంప్రదాయ సహిత వికాసం... తమిళ వారసత్వానికి గౌరవం.. తమిళనాడు ముందంజ ప్రగతి.. సంప్రదాయం పరస్పర విరుద్ధాలు కావు... పరస్పరాశ్రితాలనే దృఢ విశ్వాసమే సమకాలీన నాయకులతో పోలిస్తే ఆయన ప్రత్యేకతను చాటుతుంది. "వారసత్వ సహిత వికాసం" అనే దూరదృష్టి గల ఆయన, ఏ దేశమైనా తన నాగరిక వారసత్వంతో లోతుగా ముడిపడి ఉంటూనే వేగంగా పురోగమించగలదని నిరూపించారు. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, తయారీ సహా సామాజిక సంక్షేమం వంటి రంగాల్లోనూ ఆయన సారథ్యాన భారత్ పరిణామాత్మక ప్రగతిని సాధించింది. అదే క్రమంలో ప్రాచీన సంస్కృతి, భాషలు, ఆధ్యాత్మిక సంప్రదాయాలు, చారిత్రక వారసత్వ ప్రతిష్ట ఇనుమడించాయి. పవిత్ర క్షేత్రాల పునరుద్ధరణ, సాంస్కృతిక చిహ్నాల పునరుజ్జీవనం, ప్రాచీన భాషలకు గౌరవం, అమూల్య కళాఖండాల పరిరక్షణ తదితరాల విషయంలోనూ ఆధునిక ఆకాంక్షలు, శాశ్వత విలువల అరుదైన సమ్మేళనాన్ని ఆయన పాలన ప్రతిబింబిస్తుంది. ప్రధానమంత్రి శ్రీ మోదీ విధానం దేశ పురోగమనాన్ని వినూత్నంగా నిర్వచించింది. దేశ వాస్తవిక వృద్ధికి ఆర్థిక ప్రగతి ఒక్కటే ప్రమాణం కాదని ఆయన స్పష్టం చేశారు. వారసత్వ పరిరక్షణ, దాన్ని భావితరాలకు సంక్రమింపజేసే సామర్థ్యం కూడా అందుకు కొలబద్ద కాగలదని నిరూపించారు. ఘనమైన గతం వెన్నుదన్నుగా భవిష్యత్తులోకి ధైర్యంగా పాదంమోపే ఆత్మవిశ్వాసంతో కూడిన భారత్ పునరుజ్జీవనానికి ఆయన నిర్దేశించిన "వారసత్వ సహిత వికాసం" మార్గదర్శక సూత్రంగా మారింది.తమిళనాడుతోపాటు అంతర్జాతీయంగా విస్తరించిన తమిళ సమాజం ఈ సిద్ధాంతంతో అత్యధిక లబ్ధి పొందాయి. వారి సుసంపన్న భాషా, సాంస్కృతిక, నాగరిక వారసత్వానికి ప్రధానమంత్రి శ్రీ మోదీ నాయకత్వంలో అసాధారణ గుర్తింపు, మద్దతు లభించాయి. చెన్నై మెట్రో రైలు విస్తరణ, చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వే, తమిళనాడు రక్షణ పారిశ్రామిక కారిడార్, ఓడరేవులు–విమానాశ్రయాల ఆధునికీకరణ, జాతీయ రహదారుల విస్తరణ, రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి, సరికొత్త పంబన్ రైలు వంతెన వంటివి ప్రధాని శ్రీ మోదీ నేతృత్వాన తమిళనాడు పరిణామాత్మక ప్రగతికి తోడ్పడిన కొన్ని కార్యక్రమాలు. భారత దేశంలో సముద్రంపై తొలి నిట్టనిలువుగా లేచే పంబన్ రైలు వంతెన ప్రారంభోత్సవం ఓ కీలక ఘట్టంగా నిలుస్తుంది. భారత ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతీక అయిన ఈ వంతెన రామేశ్వరం పుణ్య క్షేత్రానికి అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది. ఇక స్వయసమృద్ధ భారత్ దృక్కోణాన్ని దృఢంగా కొనసాగించడం వల్ల, ఎలక్ట్రానిక్స్, మొబైల్ ఫోన్లు, ఐఫోన్ తయారీ తదితరాలకు తమిళనాడు ఒక ప్రసిద్ధ కూడలిగానూ ఆవిర్భవించింది.తమిళ భాష, సంస్కృతి, వారసత్వాలను శ్రీమాన్ నరేంద్ర మోదీ తరహాలో ఇంత నిలకడగా, విస్తృతంగా, ప్రపంచవ్యాప్త ప్రాచుర్యంతో మునుపటి ప్రధానమంత్రులెవరూ ముందుకు తీసుకెళ్లలేదు. తమిళ నాగరికతకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆయనొక కొత్త గుర్తింపు తెచ్చారు. దేశవిదేశాల్లో తమిళ భాష ప్రాచీనతను, సాహితీ వైభవాన్ని ఆయన నిరంతరం కీర్తించడం ప్రపంచవ్యాప్త తమిళుల హృదయాలను గాఢంగా హత్తుకుంది. మహనీయుడైన ప్రాచీన తమిళ సాధువు 'కణియన్ పూంగున్రనార్' ప్రవచించిన "యాత్తుం ఊరే.. యావరుమ్ కేళిర్" (అన్ని ఊళ్లూ నావే... అందరూ నా వారే) అనే నిత్యసత్య వాక్కును ఐక్యరాజ్యసమితిలో ఆయన ఉచ్చరించిన క్షణం తమిళ నాగరికతకు, భారతదేశానికి ఎంతో గర్వకారణం. ఈ గంభీర సందేశాన్ని అంతర్జాతీయ వేదికపైకి తేవడం ద్వారా, తమిళ సంస్కృతిలో, దాని సుసంపన్న నాగరిక వారసత్వంలో నిబిడీకృతమైన కాలాతీత మానవతా విలువలను ఆయన ప్రపంచానికి చాటారు. కార్ల్ మార్క్స్‌కు శతాబ్దాల ముందే తమిళులు "యావత్ మానవాళి ఒకటే"ననే ఉదాత్త భావనను సమర్థించారని ప్రపంచ ప్రజానీకం కూడా ఇప్పుడు గ్రహించింది. "వసుధైవ కుటుంబకం" మూలాలు కూడా ఇందులో కనిపిస్తాయి.ఇక కాశీ తమిళ సంగమం, సౌరాష్ట్ర తమిళ సంగమం వంటి కార్యక్రమాలు సాంస్కృతిక బంధాలను బలోపేతం చేస్తూ, దేశాన్ని ఏకతాటిపైకి తెచ్చే శాశ్వత నాగరికతా బంధంతో పెనవేశాయి. భారత ప్రజాస్వామ్య, నాగరికతా వారసత్వానికి తమిళనాడు చేసిన సేవకు మన కొత్త పార్లమెంటు భవనంలో సెంగోల్ ప్రతిష్ఠాపన తగిన గుర్తింపు. గంగైకొండ చోళపురంలో ప్రధానమంత్రి శ్రీ మోదీ పర్యటన చోళుల వారసత్వ ఘనతను చాటిచెప్పింది. ఇటీవల ఆనైమంగళంలోని చోళుల కాలం నాటి రాగి ఫలకాలు సహా, విదేశాల నుంచి అమూల్య కళాఖండాలు, పురాతన వస్తువులను స్వదేశం రప్పించేందుకు చేపట్టిన కార్యక్రమాలకు విస్తృత ప్రశంసలు లభించాయి. ఆలయాలు, వారసత్వ ప్రదేశాలు, ప్రాచీన సాహిత్యం, సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణ దిశగా చేయూత సహా ఇతరత్రా ఆయన చేసిన కృషి తమిళ నాగరికతకుగల అంతర్జాతీయ స్థాయిని కొత్త ఎత్తులకు చేర్చాయి. తమిళ భాష, సంస్కృతిపై ఆయనకు గల నిరంతర గౌరవాన్ని ప్రతిబింబించాయి.

**ఉపసంహారం**

ప్రతి యుగంలోనూ సమకాలీన హద్దులకు ఆవలి అంచులను స్పృశించగల దార్శనికత, కార్యాచరణ గల నాయకులు చరిత్రలో అరుదుగా కనిపిస్తుంటారు. ఒక దేశ భవిష్యత్తును తీర్చిదిద్ది, తరతరాలకూ స్ఫూర్తినిస్తారు కాబట్టే అలాంటి 'యుగపురుషులు'గా భావితరాలు గుర్తుంచుకుంటాయి. ఆ కోవలోనే పరిణామాత్మక నాయకత్వం, జాతి ప్రగతిపై అకుంఠిత దీక్ష, ప్రజలకు అవిశ్రాంత సేవ వంటి సుగుణాలున్న సమకాలీన భారత వాస్తవ 'యుగపురుషుడు'గా ఆయనను అభివర్ణించడంలో అతిశయోక్తి లేదు.ఆయన సమర్థ నాయకత్వం ఈ దేశాన్ని 2047 నాటికి 'వికసిత భారత్'గా రూపుదిద్దగలదన్నది నా ప్రగాఢ విశ్వాసం.

**(వ్యాసకర్త భారత ఉప రాష్ట్రపతి)**



శ్రీ సి.పి.రాధాకృష్ణన్

# 12 ఏళ్ల ఎగుమతి ఆధారిత వృద్ధి ప్రస్థానాన్ని వెల్లడించిన వాణిజ్య శాఖ

**హైదరాబాద్, వెలుతురు జూన్ 12, 2026:**

భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన వాణిజ్య శాఖ, ఏపీఈడీఏ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లో ఒక ప్రత్యేక సదస్సు నిర్వహించింది. "వాణిజ్య శాఖ సాధించిన 12 ఏళ్ల విజయాలు – తెలంగాణ నుంచి ఎగుమతుల పెంపుపై అవగాహన కార్యక్రమం" అనే అంశంపై జరిగిన ఈ సమావేశంలో ఎగుమతిదారులు, పరిశ్రమల ప్రతినిధులు, వ్యాపార ప్రోత్సాహక సంస్థలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.ఈ సదస్సులో భారత ప్రభుత్వ వాణిజ్య శాఖ ఈపీ(అగ్రి) విభాగం ఆర్థిక సలహాదారు ప్రియా పి. నాయర్ మాట్లాడారు. గత 12 ఏళ్లుగా వాణిజ్య శాఖ నిరంతర విధాన సంస్కరణలు, ఎగుమతుల ప్రోత్సాహక చర్యలు, కొత్త మార్కెట్ల అన్వేషణ, డిజిటల్ మార్పుల ద్వారా అంతర్జాతీయ వ్యాపారంలో భారతదేశ స్థానాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిందని ఆమె చెప్పారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎన్నో అనిశ్చితులు ఉన్నప్పటికీ వస్తువులు, సేవల ఎగుమతుల్లో సాధించిన బలమైన వృద్ధి కారణంగా భారతదేశ మొత్తం ఎగుమతులు 2013–14లో 468 బిలియన్ డాలర్లు ఉండగా, 2025–26 నాటికి 860 బిలియన్ డాలర్లు దాటి దాదాపు రెట్టింపు అయ్యాయని ఆమె స్పష్టం చేశారు. ఈ కాలంలో ఇంజనీరింగ్ వస్తువులు, ఎలక్ట్రానిక్స్, ఔషధాలు (ఫార్మా), సముద్ర ఉత్పత్తులు, దుస్తులు, వ్యవసాయ ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, రత్నాలు–ఆభరణాల రంగాలు భారీ వృద్ధిని నమోదు చేశాయని. సేవల ఎగుమతులు సైతం దేశ ఆర్థిక విస్తరణకు చోదకశక్తిగా మారాయని ఆమె పేర్కొన్నారు.ట్రేడ్ కనెక్ట్, డిజిటల్ ట్రేడ్ ఇంటెలిజెన్స్ వేదికలు.. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు(ఎంఎస్ఎంఈ) అందిస్తున్న ప్రత్యేక మద్దతు వంటి కార్యక్రమాల ద్వారా వాణిజ్య శాఖ వ్యాపార సదుపాయాలను మరింత సులభతరం చేసిందని ప్రియా పి. నాయర్ వివరించారు. దీంతో పాటు వివిధ దేశాలతో స్వేచ్ఛా వ్యాపార ఒప్పందాలను(ఎఫ్‌టీఏ) కుదుర్చుకోవడం ద్వారా ఎగుమతిదారులకు కొత్త మార్కెట్ అవకాశాలను కల్పించినట్లు చెప్పారు. నాణ్యతా ప్రమాణాలు, ట్రేసిబిలిటీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, భాగస్వాముల సమన్వయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ వ్యాపార, ఎగుమతుల కేంద్రంగా మార్చడానికి బలమైన పునాది పడిందని ఆమె అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా తెలంగాణ వాణిజ్య శాఖ కార్యదర్శి, జాతీయ పసుపు బోర్డు ప్రతినిధి ఎన్. భవానిశ్రీ, ఐఏఎస్ మాట్లాడుతూ.. భారతదేశం ఏటా దాదాపు 12 మిలియన్ మెట్రిక్ టన్నుల సుగంధ ద్రవ్యాలను ఉత్పత్తి చేస్తోందని, అయితే అందులో 13 శాతం మాత్రమే ఎగుమతి అవుతోందని చెప్పారు. తద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో మనకు ఇంకా ఎంతో వృద్ధి లభించే అవకాశం ఉందనే విషయం తెలుస్తోందన్నారు. భారతదేశ వ్యవసాయ ఎగుమతుల్లో సుగంధ ద్రవ్యాల వాటా 8 శాతానికి పైగా ఉందని, ప్రపంచంలోనే వీటిని అత్యధికంగా ఉత్పత్తి చేసే, వినియోగించే, ఎగుమతి చేసే దేశంగా భారతదేశం కొనసాగుతోందని ఆమె వివరించారు.

ప్రత్యేక ఆర్థిక మండళ్ల(సెజ్) భాగస్వామ్యాన్ని వివరిస్తూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ వ్యాప్తంగా దాదాపు 40 కార్యాచరణ సెజ్‌లు పనిచేస్తున్నాయని, వీటి నుంచి ఎగుమతులు దాదాపు రూ. 15 లక్షల కోట్లకు చేరాయని ఆమె తెలిపారు. తెలంగాణలోని సెజ్‌లు ఔషధాలు, ఐటీ, ఏరోస్పేస్, రక్షణ రంగ తయారీకి ప్రధాన కేంద్రాలుగా మారాయన్నారు. సెజ్‌లు, ఎగుమతి ఆధారిత విభాగాలు(ఈఓయూ) సుంకం లేని దిగుమతులు, సరళీకృత కస్టమ్స్ విధానాలు, సింగిల్ విండో అనుమతులు వంటి ప్రయోజనాలను అందిస్తూ వ్యాపార నిర్వహణను సులభతరం చేస్తున్నాయని, ఎగుమతి సామర్థ్యాన్ని పెంచుతున్నాయని ఆమె పేర్కొన్నారు.ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ కె. రాజా భాను మాట్లాడుతూ.. భారతీయ ఔషధ ఉత్పత్తులు ఇప్పుడు 190కి పైగా దేశాలకు చేరుతున్నాయని, ప్రపంచంలోని మొదటి 25 అత్యుత్తమ జెనరిక్ మందులలో పది భారతదేశం నుంచే సరఫరా అవుతున్నాయని చెప్పారు. ఇది దేశ తయారీ రంగ ప్రతిభను, నాణ్యతా ప్రమాణాలను, శాస్త్రీయ సామర్థ్యాలను ప్రతిబింబిస్తోందని, ప్రపంచ ఆరోగ్య సంరక్షణ సరఫరాదారుగా భారతదేశ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తోందని ఆయన అన్నారు.ఏపీఈడీఏ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్. పి. నాయుడు మాట్లాడుతూ.. భారతదేశ వ్యవసాయ ఎగుమతుల రంగంలో తెలంగాణ వాటా నిరంతరం పెరుగుతోందన్నారు. బాస్మతీయేతర బియ్యం ఎగుమతుల్లో రాష్ట్రం రూ. 8,000 నుంచి 10,000 కోట్ల వరకు సహకారం అందిస్తోందని చెప్పారు. రవి ఫుడ్స్, కరాచీ బేకరీ వంటి సంస్థల ద్వారా తెలంగాణ ఒక ప్రధాన బేకరీ ఉత్పత్తుల ఎగుమతి కేంద్రంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. భౌగోళిక గుర్తింపు(జీఐ) పొందిన బంగినపల్లి మామిడి పండ్ల ఎగుమతులకు ఏపీఈడీఏ అందిస్తున్న మద్దతు, ట్రేస్‌నెట్ ద్వారా సేంద్రీయ వ్యాపార ప్రోత్సాహం, ఎగుమతి మౌలిక సదుపాయాలు, నాణ్యత పరీక్షా కేంద్రాల కోసం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని ఆయన వివరించారు.ఈసీజీసీ ప్రతినిధి సురేష్ బాబు మాట్లాడుతూ.. అంతర్జాతీయ వ్యాపారంలో వాణిజ్య, రాజకీయ నష్టాలకు వర్తించే క్రెడిట్ ఇన్సూరెన్స్ సౌకర్యాల ద్వారా ఎగుమతిదారులకు చెల్లింపుల నష్టాల నుంచి రక్షణ కల్పించడంలో తమ సంస్థ పాత్రను వివరించారు. విదేశీ కొనుగోలుదారులను అంచనా వేయడంలో, క్రెడిట్ పరిమితులను పొందడంలో, చెల్లింపులు జరగని పక్షంలో రక్షణ పొందడంలో ఈసీజీసీ ఎగుమతిదారులకు సహాయం చేస్తుందని చెప్పారు. ఎంఎస్ఎంఈల కోసం రూపొందించిన ప్రత్యేక ఉత్పత్తులు, ఒకే కొనుగోలుదారు నష్టాలు, షిప్‌మెంట్‌కు ముందు ఉండే నష్టాలు, దేశీయ వ్యాపార క్రెడిట్ గురించి ఆయన వివరించారు. నష్టాల నిర్వహణ, క్లెయిమ్‌ల సకాలంలో పరిష్కారానికి డాక్యుమెంటేషన్, నిబంధనల పాటించడం, సకాలంలో వివరాలు ప్రకటించడం చాలా ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(డీజీఎఫ్‌టీ) డాక్టర్ సంపత్ కుమార్, ఐటీఎస్ మాట్లాడుతూ.. విదేశీ వాణిజ్య విధానం కింద అమలు చేస్తున్న కీలక ఎగుమతి ప్రోత్సాహక చర్యలను వివరించారు. ఎగుమతిదారుల కోసం డిజిటల్ సేవలు, ఎఫ్‌టీఏల కింద లభించే ప్రయోజనాలు, ఈ–కామర్స్ వేదికల ద్వారా ఎంఎస్ఎంఈలకు లభించే మద్దతు, ఆర్థిక సహాయ పథకాలు, భారతీయ వ్యాపారాలు తమ అంతర్జాతీయ పరిధిని విస్తరించుకోవడానికి ఉద్దేశించిన వ్యాపార సదుపాయాల కార్యక్రమాల గురించి ఆయన మాట్లాడారు. ఎగుమతిదారులు, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలు వాణిజ్య శాఖ, ఏపీఈడీఏ, డీజీఎఫ్‌టీ, ఈసీజీసీ, ఇతర వ్యాపార ప్రోత్సాహక సంస్థలతో చురుగ్గా పాలుపంచుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు.

ప్రభుత్వ అవగాహన, సామర్థ్య పెంపుదల కార్యక్రమాల్లో పాల్గొంటూ, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలని కోరారు. ఎగుమతులను పెద్ద ఎత్తున పెంచడానికి, ఉపాధిని సృష్టించడానికి, భారతదేశాన్ని ప్రపంచ వ్యాపార శక్తిగా మార్చే ప్రయాణంలో భాగస్వాములు కావడానికి నాణ్యతా ప్రమాణాలు, ధ్రువీకరణ పత్రాలకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.




- **అంతర్జాతీయంగా లభిస్తున్న సరికొత్త అవకాశాలను తెలంగాణ అందుకోవాలని పిలుపు**
- **విధానపరమైన సంస్కరణలు, మార్కెట్ల విస్తరణ, డిజిటల్ వ్యాపార సదుపాయాల ద్వారా దాదాపు రెట్టింపు వృద్ధితో 2025-26 నాటికి 860 బిలియన్ డాలర్లు దాటిన భారతీయ ఎగుమతులు**



# ప్రత్యేక ఆర్డినేన్స్ ద్వారా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టిఈటి నుండి మినహాయింపు ఇవ్వాలి

- తపస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, రంగారెడ్డి జిల్లాఅధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోట్ల కాశిరావు పూజరి రమేశ

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూన్ 12:**

ఇబ్రహీంపట్నం తపాస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి తేల్కలపల్లి పెంటయ్య మాట్లాడుతూ ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు ఎన్ సిటిఈ నిబంధనలకు అనుగుణంగా 2025,01 సె ప్టెంబర్ లో సుప్రీం కోర్ట్ తీర్పు వెలువడింది దీనితో ఆందోళన చెందిన సర్వీస్ ఉపాధ్యాయులు65 రివ్యూపిటిషన్ వేశారు నిబంధనల ఆధారంగానే సుప్రీంకోర్ట్ ఆరివ్యూలను కొట్టివేస్తూ2028ఆగష్టు 31 లోపు ఇన్ సర్వీస్ టీచర్స్ కు చివరి అవకాశంగా తీర్పుఇచ్చినది దీని ప్రకారం సర్వీస్ రిమూ వ్ చేసే అవకాశం ఉంది.తెలంగాణలో 30000 మంది ఉపాధ్యాయులకు టిఈటి పాస్ కావాల్సి న అవసరం ఉంది ఇటీవల ప్రత్యేకంగా2సార్లు టిఈటి నిర్వహణ చేస్తామనే రాష్ట్రప్రభుత్వం నిర్ణ యం కాస్త ఊరట మాత్రమేవిద్యాహక్కుచట్టం అమలు ద్వారా టీఈటి అంశం ప్రస్తావన జరిగింది ఏప్రిల్ 01,2010 పూర్వం



న్యాయబద్ధంగా నోటిఫికేషన్ వచ్చి నియామకం అయిన ఉపాధ్యా యులకు ఆనాడు టిఈటి అవసరంలేదు స్పష్టంగా పేర్కొనడం జరిగింది తర్వాత డియస్ సి నోటి ఫికేషన్ లో టిఈటి అర్హత ఆధారంగానే నియామకాలు జరుగుతున్నా యిఏప్రిల్ 01,2010 అర్ టిఈ రూల్స్ అనుగుణంగా ఎన్ సిటిఈ టిఈటి నిబంధనలు చేర్చింది ఈనిబంధనల ఆధారంగా నే సుప్రీం కోర్ట్ తీర్పు ఇచ్చింది ఇది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు అన్యాయం కల్గిస్తుంది గత 30 సంవత్సరాల నుండి ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న విషయంలో భోదిస్తున్నారు టిఈటి లో మాత్రం అన్ని విషయాలు కలిపి పరీక్షలు పెట్టడం జరుగుతుంది భాషా ఉపాధ్యాయులకు ఇతర సబ్జెక్టు ఉపాధ్యాయులు కూడా తమబోధనకు సంబంధంలేని సబ్జెక్టు చదవి పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఉంది అలాంటిప్పుడు ప్రత్యేకంగా టిఈటి ఎన్నిసార్లు పెట్టిన ప్రయోజనం లేదనే భావన ఉపాధ్యాయుల్లో ఉంది పైగా NCERT ,SCERTఆధ్వర్యంలో దీక్ష & నిష్ఠ,లాంటి అనేక ఆన్లైన్ వృత్యంతర శిక్షణ ఇస్తూనే ఉన్నారుతద్వారా సమకాలిన పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యా యులు నేర్చుకుంటున్నారు ఇది అసంబద్ధ నిర్ణయంగా తపస్ అనేక మార్లు ప్రభుత్వాలకు నివేదిం చింది తెలంగాణ ప్రాంతఉపాధ్యాయ సంఘంద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్డినేన్స్ తెచ్చి ఏప్రిల్ 1,2010 కన్న ముందు వేసిన నోటిఫికేషన్ ద్వారా నియమాలు అయినా ఇన్ సర్వీస్ ఉ పాధ్యాయులకు టిఈటి నుండి మినహాయింపునుకోరుకుంటున్నాముతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడ కేంద్రం ప్రభుత్వంను ఒప్పించేలా తగుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారుఈ కార్యక్ర మంలో తపస్ రాష్ట్రబాధ్యులు సత్తారి రాజిరెడ్డి జిల్లాఉపాధ్యక్షులు కరుణాకర్ రెడ్డి జిల్లాకా ర్య దర్శి పట్నం కృష్ణ మంచాల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావుల శివకుమార్ కావలి ద త్తాత్రేయ మరియు మంచాల మండల కోశాధికారి చీర బలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల హితాసక్తుడు, ఉద్యోగుల హృదయ నేత తెలంగాణ నాన్ గెజెటెడ్ అధికారుల సంగం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మారం జడ్జీశ్వర్ - సయిద్ ముజీబ్ హుసైని ఘన సన్మానం

**మేడ్చల్ వెలుతురు జూన్ 12:**

ఉద్యోగుల సంక్షేమం కోసం తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (TNGOs) కేంద్ర సంఘం నిరంతరం చేస్తున్న కృషికి గుర్తింపుగా, హైదరాబాద్ నాంపల్లిలోని TNGOs భవన్‌లో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీష్ మరియు ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. హుసేని ముజీబ్ ని మెద్చల్–మల్కాజిగిరి జిల్లా TNGOs అధ్యక్షులు మరియు జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ బి. రవి ప్రకాష్, జిల్లా కార్యదర్శి భారత్ కుమార్, రాష్ట్ర కోశాధికారి శ్రీమతి ఉమాదేవి, నిర్మల్ జిల్లా TNGOs అధ్యక్షులు ప్రభాకర్ మరియు కరీంనగర్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ ఘనంగా సన్మానించారు.ఉద్యోగులకు హెల్త్ కార్డుల మంజూరు, ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీలను పారదర్శకంగా చేపట్టడం, అలాగే మెద్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఉద్యోగులకు వర్తించే హౌస్ రెంట్ అలవెన్స్ (HRA) ను 11 శాతం నుండి 24 శాతానికి పెంచే అంశంలో కేంద్ర సంఘం చేసిన కృషిని ఈ





సందర్భంగా వారు ప్రత్యేకంగా అభినందించారు.అలాగే, TNGOs అసోసియేట్ అధ్యక్షులు శ్రీ శ్యామ్యూల్ పాల్ గారు తిరుమలగిరి RTO కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా కేంద్ర సంఘం అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శి వారు ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మరియు JAC ఛైర్మన్ శ్రీ బి. రవి ప్రకాష్ గారు, జిల్లా కార్యదర్శి శ్రీ భారత్ కుమార్ గారు, రాష్ట్ర కోశాధికారి శ్రీమతి ఉమాదేవి గారు, నిర్మల్ జిల్లా TNGOs అధ్యక్షులు శ్రీ ప్రభాకర్ గారు, కరీంనగర్ జిల్లా కార్యదర్శి శ్రీ లక్ష్మణ్ గారు, ఉపాధ్యక్షులు శ్రీ జేమ్స్ దాస్ గారు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీ సుధీర్ కుమార్ గారు, శ్రీ కొండల్ రావు గారు (పబ్లిసిటీ సెక్రటరీ), శ్రీ మాణిక్యం గారు (హాస్టల్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షులు), శ్రీ నర్సింహారావు గారు, శ్రీ సుధాకర్ రెడ్డి గారు, శ్రీమతి అరుణ గారు, మల్కాజిగిరి యూనిట్ అధ్యక్షులు, మెద్చల్ యూనిట్ అధ్యక్షులు శ్రీ శ్రీనివాస్ గారు, శ్రీ రవి యాదవ్ గారు (షామీర్‌పేట్ అధ్యక్షులు), ఘట్‌కేసర్ యూనిట్ కార్యదర్శి శ్రీ రాజ్ కుమార్ గారు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

- మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి కనీ సవేతనం 26,000ఇవ్వాలి పెండింగ్ వేతనాలు చెల్లించాలి
- గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజు, గ్యార పాండు

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూన్ 12;**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలాన్ రంగారెడ్డి జిల్లాకార్యాలయం గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లాకలెక్టర్ కార్యాలయం ముందు మహాధర్నా చేశారు అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి అనంతరెడ్డి గారికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు ఈసందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్ రాజు గ్యార పాండు మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రతినెల1వ తేదీనే వేతనాలు అందేలా 50 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పిన నేటికీ వేతనాలు చెల్లించలేదన్నారు.ఈ వేతనాలను గ్రీన్ ఛానల్ ద్వారా





చెల్లించి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు జీవో నెంబర్ 51ని స వరించి మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు కరోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలన్నారు పెండింగ్ లో ఉన్న నాలుగు నెలల వేతనాన్ని తక్షణమే ఇ వ్వాల న్నారు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పంచాయతీ సిబ్బంది అం ద రిని పర్మినెంట్ చేసి కనీసవేతనం 26,000 వెంటనే అమలు చేయాలని ప్రమాదం జరిగి మరణిం చిన సిబ్బందికి 20 లక్షల నష్ట పరిహారం కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కార్మికులందరికీ10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని. మరణించిన కార్మికుల దహన సంస్కారాలకు కనీసం 30 వేలఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.పంచాయతీ కా ర్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇండ్ల స్థలాలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని డిమాం డ్ చేశారు.లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆ ధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పోచమోని కృష్ణ జగన్ పోల్కంపల్లి యూనియన్ కోశాధికారి దే వదాస్ యూనియన్ నాయకులు శేఖర్ మాధవి యాదయ్య జగన్ భాస్కర్ తదితరులు పాల్గొ న్నారు.

# ప్రైవేట్ పాఠశాలలు జర్నలిస్టుల పిల్లల చదువు కోసం ఫీజులో 50% రాయితీ ఇవ్వాలి: టిడబ్ల్యూజేఎఫ్



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 12:**

ప్రైవేట్ పాఠశాలలు జర్నలిస్టుల పిల్లల చదువు కోసం ఫీజులో 50% రాయితీ ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం మేడ్చల్–మల్కాజిగిరి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో మాయొక్క జర్నలిస్టుల పిల్లలకు 2026–27 సంవత్సరాలకు ఫీజుల్లో 50% రాయితీ జిల్లా విద్యాధికారి (DEO) వినతిపత్రం అందజేశారు. టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి గడ్డమీది అశోక్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు దామర జగదీశ్వర్ గుప్తా, ఏ గోవిందరావు లు మాట్లాడుతూ.... మేడ్చల్ జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టుల పిల్లలకు ప్రతి విద్యా సంవత్సరం మాదిరిగా ప్రైవేట్ పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ కల్పిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం మన జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 80 శాతం జర్నలిస్టులు వేతనాలు లేక నెలవారీ ఆదాయం లేక తమ పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు ఫీజులు కట్టలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పిల్లలకు 2026–27 విద్యా సంవత్సరాల్లో ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50% ఫీజు రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక రాయితీ అమలు చేయాలని సూచించారు చేస్తున్నాం. రాబోయే 2026–27 విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేనాటికి జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా జీవో/సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ జేఎఫ్ నాయకులు శివకుమార్, వీరేష్ ముదిరాజ్, సంజీవ్ కుమార్, శ్యాం ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మూసాపేట్ గౌడ సంఘం భారీ విరాళం

### తొలి విడతగా రూ.5 లక్షల చెక్కు అందజేత

**కూకట్ పల్లి జూన్ 12 వెలుతురు:**



మూసాపేట్ గడిగుట్ట మైసమ్మ ఆలయం సమీపంలో నిర్మాణంలో ఉన్న శ్రీ ఎల్లమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి మూసాపేట్ గౌడ సంఘం విశేష సహకారం అందించింది. ఆలయ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా సంఘం తరఫున మొత్తం రూ.10 లక్షల విరాళం అందజేయాలని నిర్ణయం తీసుకున్నారు.ఈ నిర్ణయంలో భాగంగా గురువారం తొలి విడతగా రూ.5 లక్షల చెక్కును ఆలయ కమిటీ సభ్యులు, చైర్మన్ ఐలయ్య, కేబుల్ శ్రీను, బిక్షపతి రామచంద్ర సింగ్‌కు గౌడ సంఘం సభ్యులు అందజేశారు. మిగిలిన రూ.5 లక్షలను ఈ నెల 30వ తేదీలోపు అందజేయనున్నట్లు సంఘం ప్రతినిధులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణం భక్తుల సహకారంతో ముందుకు సాగుతుండటం ఆనందదాయకమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇప్పటికే తమ వంతు సహకారం అందించిన ప్రతి దాతకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మరింత మంది దాతలు ముందుకు వచ్చి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ నల్ల పోచమ్మ గుడి చైర్మన్ రాచమల్ల బిక్షపతి గౌడ్, లక్ష్మణ్ గౌడ్, అంజి గౌడ్, వెంకటేష్ గౌడ్, అనంతయ్య గౌడ్, రాచమల్ల శేఖర్ గౌడ్, గుడికాడ శ్రీనివాస్ గౌడ్, కొత్తపల్లి రవి గౌడ్, బాలరాజు గౌడ్, పాండు ముదిరాజ్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# వివేకానందనగర్‌లో డ్రైనేజీ సమస్యలతో ప్రజల అవస్థలు.. తక్షణ చర్యలకు మాజీ కార్పొరేటర్ రంగారావు డిమాండ్

**కూకట్ పల్లి జూన్ 12 వెలుతురు:**



వివేకాన ంద న గ ర్ డివిజన్‌లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు డీజీఎం శ్రీనివాస్ రాజు, మేనేజర్ అనిల్ లను కలసి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలోని ప్రాజెక్ట్ మేనేజర్లను కలిసి డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన వారి దృష్టికి తీసుకెళ్లారు. వివేకానందనగర్ డివిజన్‌లోని వడ్డేపల్లిఎన్‌క్లేవ్ ప్రాంతంలో గత ఆరు నెలలుగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని రంగారావు పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి గతంలోనే నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే పనులు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను కోరారు. అదేవిధంగా శ్రీనివాసనగర్ మెడికల్ సొసైటీ నుంచి రామాలయం రోడ్డు వరకు చేపట్టాల్సిన డ్రైనేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. నవభారత్ వెల్ఫేర్ అసోసియేషన్ సమీపంలోని 35వ బ్లాక్ వద్ద కాలుష్య నీరు చేరి ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పటేల్‌కుంట చెరువు పరిసర ప్రాంతాల్లో గతంలో చేపట్టిన డ్రైనేజీ పనులు సక్రమంగా లేకపోవడంతో మురుగునీటి ప్రవాహం సరిగా జరగడం లేదని తెలిపారు. నీరు సాఫీగా వెళ్లేలా తగిన చర్యలు తీసుకోకపోతే ప్రజలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని మాధవరం రంగారావు అధికారులను కోరారు.

# అర్హులైన ప్రతి పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుంది

- కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లాప్రధాన కార్యదర్శి మాంకాల శేఖర్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూన్ 12:**



ఇబ్రహీంపట్నం మండల ఎలిమినేడు గ్రామంలోకాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లాప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతిపేద కుటుంబానికి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇ ల్లు రెండో విడత అతిత్వరలో మంజూరు అవుతాయని అన్నారు ప్రతి పేదవాడికి పక్క ఇందిర మ్మ ఇల్లు ఇవ్వనున్నట్లు తెలిపారు స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో ప్రతిగ్రామం లో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతుంది అన్నారు మొదటి విడతలో ఇంది రమ్మ లబ్ధిదారులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు కేవలం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మరి యు స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో రావడం మాకు ఎంతో సంతోషంగా ఉంది గత ప్రభుత్వ హాయంలో పేదవారికి ఎటువంటి లబ్ధి చేకూర లేదని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామపెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# వాటర్ వర్క్స్ ట్రీట్ యూనియన్ ఎన్నికల్లో అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వారికి బొకే ఇచ్చి అభినందనలను తెలిపిన మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు జూన్ 12:**

ఇటీవలే జరిగిన వాటర్ వర్క్స్ ట్రీట్ యూనియన్ ఎన్నికల్లో అధ్యక్షులుగా ఎన్నికైన మొగలి రాజిరెడ్డి మరియు ఎన్నికైన రాఘవేంద్ర రాజ్ మీ హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ బొకే ఇచ్చి అభినందనలను తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో జి. రామన్ గౌడ్, పూర్ణచందర్, జైస్వాల్, శేఖర్, రాజేంద్ర గౌడ్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

# సురక్షితమైన, స్థిరమైన గనుల తవ్వకాల్లో 'మైనింగ్ 4.0' సాంకేతికత కీలక పాత్ర

**జాతీయ సదస్సులో నిపుణులు**

**వెలుతురు ఉస్మానియా యూనివర్సిటీ జూన్ 12:**

మైనింగ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (MEAI) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో "మైనింగ్ 4.0 – సురక్షితమైన స్థిరమైన గనుల నిర్వహణ కోసం అధునాతన సాంకేతికతలు" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ఘనంగా ప్రారంభమైంది. మైనింగ్ రంగంలో భద్రత, స్థిరత్వం కార్యాచరణ నైపుణ్యాన్ని పెంపొందించడంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం యొక్క ప్రాముఖ్యతను చర్చించడానికి మైనింగ్ నిపుణులు, పరిశ్రమల అధినేతలు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలు ఈ సదస్సులో ఏకమయ్యారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎన్ఎండీసీ (NMDC) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అమితాబ్ ముఖర్జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథులుగా MEAI వైస్ ప్రెసిడెంట్ & ERM గ్రూప్ COO ధనంజయ్ జి. రెడ్డి, MEAI ప్రెసిడెంట్ & టాటా స్టీల్ సర్వీసెస్ అధినేత డి.బి. సుందర రామన్, NMDC డైరెక్టర్ (ప్రొడక్షన్) జయదీప్ దాస్‌గుప్తా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి NMDC డైరెక్టర్ (టెక్నికల్) & MEAI హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ వినయ్ కుమార్ అధ్యక్షత వహించారు.ప్రతినిధులకు స్వాగతం పలుకుతూ వినయ్ కుమార్ ప్రసంగిస్తూ, మైనింగ్ రంగంలో వృత్తిపరమైన నైపుణ్యాన్ని , సాంకేతిక పురోగతిని పెంపొందించడంలో MEAI పోషిస్తున్న పాత్రను వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (IoT), రోబోటిక్స్, అటానమస్ సిస్టమ్స్, జియోస్పేషియల్ టెక్నాలజీస్ అడ్వాన్స్‌డ్ సేఫ్టీ అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతల ద్వారా 'మైనింగ్ 4.0' భవిష్యత్తు మైనింగ్ రంగాన్ని మారుస్తోందని ఆయన నొక్కిచెప్పారు. NMDC డిజిటల్ పరివర్తనలో భాగంగా ఫ్లీట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, డ్రోన్ ఆధారిత పరిశోధనలు ప్రముఖ విద్యాసంస్థలతో కలిసి AI/ML ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.NMDC సీఎండీ అమితాబ్ ముఖర్జీ మాట్లాడుతూ, మైనింగ్ రంగంలో సాంకేతికత ఆధారిత పద్ధతులను అవలంబించడం ఆవిష్కరణల ద్వారా భద్రతను, పర్యావరణ స్థిరత్వాన్ని పెంచడం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. "మైనింగ్ భవిష్యత్తు అనేది భద్రత సాంకేతికతల కలయికపై ఆధారపడి ఉంటుంది. ఆధునిక పరిశ్రమలకు అవసరమైన ఖనిజాల డిమాండ్ పెరుగుతున్న తరుణంలో, మైనింగ్ రంగం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి," అని ఆయన అన్నారు. అధునాతన సాంకేతికతలు ప్లానింగ్ నుండి తవ్వకాలు, ప్రాసెసింగ్ రవాణా వరకు పూర్తి పరివర్తనను తీసుకువస్తాయని, దీనివల్ల మైనింగ్ మరింత సురక్షితంగా, స్మార్ట్‌గా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.




MEAI వైస్ ప్రెసిడెంట్ ధనంజయ్ జి. రెడ్డి మాట్లాడుతూ, అధునాతన సాంకేతికతలు కేవలం పెద్ద మైనింగ్ సంస్థలకే పరిమితం కాకుండా, చిన్న అసంఘటిత మైనింగ్ రంగాలకు కూడా చేరాలని ఆకాంక్షించారు. దేశ ఆర్థిక పారిశ్రామిక అభివృద్ధికి మైనింగ్ రంగం వెన్నెముక అయినప్పటికీ, దీనిపై సమాజంలో తరచుగా ప్రతికూల భావనలు ఉంటాయని, అందువల్ల బాధ్యతాయుతమైన మైనింగ్ పద్ధతులు, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత మైనింగ్ కమ్యూనిటీపై ఉందన్నారు.

**డి.బి. సుందర రామన్**

టాటా స్టీల్ ప్రతినిధి MEAI ప్రెసిడెంట్ డి.బి. సుందర రామన్ మాట్లాడుతూ, 'మైనింగ్ 4.0' అనేది ఇప్పుడు ఒక ఎంపిక మాత్రమే కాదని, పరిశ్రమ భవిష్యత్తుకు ఒక వ్యూహాత్మక అవసరమని స్పష్టం చేశారు. టాటా స్టీల్ అనుభవాలను పంచుకుంటూ.. కేంద్రీకృత నియంత్రణ గదులు , స్మార్ట్ హెల్మెట్లు, పర్యావరణ పర్యవేక్షణ వ్యవస్థలు ప్రిడిక్టివ్ అనలిటిక్స్ వంటి సాంకేతికతలు భద్రతను పనితీరును మెరుగుపరుస్తున్నాయని వివరించారు. "భూమి నుండి ఏమి తీస్తున్నామనేది మాత్రమే కాదు, ఎంత సురక్షితంగా, బాధ్యతాయుతంగా తీస్తున్నామనేదే ముఖ్యం" అని ఆయన అన్నారు.

NMDC డైరెక్టర్ (ప్రొడక్షన్) శ్రీ జయదీప్ దాస్‌గుప్తా మాట్లాడుతూ, మైనింగ్ కార్యకలాపాల నిర్వహణలో మైనింగ్ 4.0 ఒక విప్లవాత్మక మార్పును సూచిస్తుందన్నారు. ప్రమాదకర ప్రాంతాలలో మానవ ప్రమేయాన్ని తగ్గించడం, ఇండస్ట్రియల్ IoT, స్మార్ట్ సెన్సార్లు అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్ ద్వారా ఉత్పాదకతను పెంచడమే దీని ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు.

సాంకేతికత మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదని, దానిని మరింత ఉన్నతీకరిస్తుందని ఆయన పేర్కొన్నారు. గనుల్లో పనిచేసే ప్రతి కార్మికుడు రోజు ముగిసేసరికి సురక్షితంగా ఇంటికి చేరడమే అంతిమ లక్ష్యం కావాలని ఆయన ఆకాంక్షించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా మైనింగ్ రంగానికి విశేష సేవలు అందించిన నలుగురు ప్రముఖులను (శ్రీ అక్షయ్ దత్ త్రిపాఠి, శ్రీ ఎస్. కృష్ణమూర్తి, డాక్టర్ కె.వి. శంకర్ తదితరులను) ఘనంగా సత్కరించారు.

# రామన్నపేట డిగ్రీ కాలేజ్ విద్యార్థి అగ్ని వీర్ ఉద్యోగానికి ఎంపిక

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 12:**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మోటె నవీన్ అను విద్యార్థి ఇటీవల సైన్య ఉద్యోగాలకు సంబంధించిన పోటీ పరీక్షలో ఉత్తమ ఫలితాల్ని సాధించి అగ్నివీర్ ఉద్యోగానికి ఎంపిక కావడం పట్ల కళాశాల పక్షాన సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ కష్టపడితే సాధించనిది ఏమీ లేదని, నవీన్ క్రమశిక్షణ గల విద్యార్థిగా, ఎన్సిసి క్యాడెట్ గా ఉండి కఠినమైన శారీరక దారుఢ్య పరీక్షల్ని ఎదుర్కొని అగ్నివీర్ ఉద్యోగానికి ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. ఇతర విద్యార్థులు కూడా ఇతనిని స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉందని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.చిన బాబు, ఐ క్యుఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ



నీలిమ, పరిపాలనాధికారి జి. కరుణాకర్, అధ్యాపకులు డాక్టర్ జి. సునీత, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ సిహెచ్. వెంకట్ గౌడ్, ఎం.అనిత, డాక్టర్ డి.కిషన్, డాక్టర్ పి.బ్రహ్మం, డాక్టర్ ఎం. రవీందర్ రావు, డాక్టర్ రాచమళ్ళ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు ఘన సన్మానం

**మునుగోడు,జూన్ 12(వెలుతురు):**

మండలంలో వివిధ కార్యాలయాలలో విధులు నిర్వహిస్తూ ఉత్తమ సేవలు అందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏ ఈ, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది బదిలీపై వెళ్తున్న సందర్భంగా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల అభివృద్ధికి,ప్రజలకు అందించిన సేవలను కొనియాడుతూ ఎంపీడీవో మేకల విజయభాస్కర్,ఎంపీఓ, సర్పంచులు కలిసి ఉద్యోగులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఉద్యోగులు తమ సేవా కాలంలో అందించిన సహకారం,కృషిని ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు మాట్లాడుతూ మునుగోడు మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారాన్ని ఎప్పటికీ మరువలేమని తెలిపారు. ఈ కార్యక్రమంలో



మండల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 51-రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయ పార్టీల సమన్వయ సమావేశం

- **రాజేంద్రనగర్ ఎన్నికల అధికారుల సమన్వయ సమావేశంలో పాల్గొన్న బీజేపీ నేత బొక్కా బాల్ రెడ్డి**

**రాజేంద్రనగర్, వెలుతురు జూన్ 12:**

51–రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రాబోయే ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా మరియు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాజకీయ పార్టీల ముఖ్య ప్రతినిధుల సమన్వయ సమావేశం స్థానిక రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జరిగింది. ఈ కీలక సమావేశంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తరఫున ప్రముఖ నాయకులు బొక్కా బాల్ రెడ్డి అధికారిక ప్రతినిధిగా హాజరై, నియోజకవర్గ పరిధిలోని పలు కీలక అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం బీజేపీ నేత బొక్కా బాల్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా అత్తాపూర్,




మైలార్‌దేవ్‌పల్లి, శివరాంపల్లి, ఉప్పరపల్లి, రాజేంద్రనగర్ తదితర డివిజన్లలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. బీజేపీ తరపున బొక్కా బాల్ రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ముఖ్యమైన అంశాలు

పారదర్శక ఓటర్ల జాబితా:

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, జాబితాలో ఉన్న లోపాలను, తప్పుడు ఓట్లను త్వరితగతిన తొలగించి పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు:

పోలింగ్ బూత్‌ల వద్ద తాగునీరు, నీడ, వృద్ధులకు మరియు దివ్యాంగులకు అవసరమైన వీల్ చైర్స్, ర్యాంపుల సౌకర్యం కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నిబంధనల కఠిన అమలు:

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (Model Code of Conduct) అన్ని పార్టీలు కచ్చితంగా పాటించేలా చూడాలని, అధికార దుర్వినియోగానికి తావులేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను కోరారు.భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ చట్టబద్ధమైన, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు కట్టుబడి ఉంటుందని, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో శాంతియుత ఎన్నికల పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా బొక్కా బాల్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రిటర్నింగ్ అధికారితో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు వెంటనే దుస్తులను అందించాలి:సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 12:**

సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని తెలుసుకోవడానికి శుక్రవారం జగద్గిరిగుట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సిపిఐ బృందం పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంకా రెండు రోజుల్లో పాఠశాలలు ప్రారంభమవుతున్నాయని కానీ నేటికీ ప్రభుత్వ పాఠశాల పిల్లలకు ప్రభుత్వం నుండి అందాల్సిన విద్యార్థుల యూనిఫాం అందలేదని, అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బోధించడానికి జీవశాస్త్ర ఉపాధ్యాయుడు లేరని మరియు పారిశుద్ధ్య రక్షణ సమస్యలు ఉన్నాయని సందర్శనలో తెలిసిందని కావున ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫాంలు అందించి, తగిన బోధన సిబ్బంది ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి ఎం సహదేవరెడ్డి ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు సిపిఐ నాయకులు కృష్ణ శ్రీనివాస్ చారి యువజన నాయకులు కార్తీ క్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.




# కన్నుల పండుగగా లక్ష్మీ సుదర్శన యాగం

**వెలుతురు నారాయణఖేడ్ జూన్ 12 :**

సంగారెడ్డి జిల్లా :– నారాయణఖేడ్ పట్టణంలోని మహతి జ్యోతిష్యాలయంలో లక్ష్మీ సుదర్శన యాగం శుక్రవారం రోజు అత్యంత వైభవంగా కొనసాగింది. బ్రహ్మశ్రీ మలమంచి గురురాజు శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, సుదర్శన యాగ హోమం కార్యక్రమాలు నిర్వహించగా దంపతులు భక్తులు పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. మహా హారతి యాగ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.లోక



కళ్యాణార్థం నెల రోజుపాటు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తులు స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని గురుపంతులు అన్నారు. ముగింపు కార్యక్రమంలో జూన్ 15వ తేదీన రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ సుదర్శన యాగంలో పాల్గొననున్నారని భక్తులు కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని లక్ష్మీ సుదర్శన యాగ ఫల కటాక్షాన్ని పొందాలని చెప్పారు.

# బీఎల్ఏ (BLA)ల అవగాహన మరియు శిక్షణ సదస్సులో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 12:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని కొంపల్లి ఎస్ఎన్ఆర్ గార్డెన్ లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బిఎల్ఏ అవగాహన మరియు శిక్షణ సదస్సుకు స్థానిక మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఈ బిఎల్ఏ శిక్షణ కార్యక్రమ ఇంచార్జ్ M.A ఫహీమ్ గారితో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు మాట్లాడుతూ పార్టీ బలోపేతనికి, ఎన్నికల ప్రక్రియ సమర్థ నిర్వహణలో బూత్ స్థాయి ఏజెంట్ల (BLA) పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నాను.నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసి ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చాను, ప్రతి బూత్ స్థాయి లో ఉన్నటువంటి ఏజెంట్లు సర్ ( SIR) కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొని నకిలీ ఓటర్ల తొలగించే విధంగా అధికారులతో సమన్వయం చేసుకుంటూ బూత్ లెవెల్ ఆఫీసర్ తో కలిసి క్షేత్ర స్థాయి లో పనిచేయాలని పిలుపునిచ్చారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లి వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం లక్ష్యంగా పనిచేయాలి అని అన్నారు.ఈ శిక్షణ సదస్సులో స్థానిక ఇన్చార్జ్ హనుమంత్ రెడ్డి మరియు కుత్బుల్లాపూర్ కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు భూపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ రెడ్డి, మైపాల్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు,స్థానిక డివిజన్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.



## కరీంనగర్‌లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన ర్యాలీ...




**బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకరించాలి**

**కరీంనగర్ వెలుతురు జూన్ 12:**

ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం రోజున మహిళా , శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, పోలీసు శాఖ, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సమన్వయంతో కరీంనగర్‌లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.జిల్లా పరిషత్ కార్యాలయం నుండి గీత భవన్ చౌరస్తా వరకు కొనసాగిన ఈ ర్యాలీని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి ,జిల్లా కార్మిక శాఖ అధికారి ప్రసాద్ లు ప్రారంభించారు. ర్యాలీ సందర్భంగా వివిధ దుకాణాలు, వాణిజ్య సంస్థలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బాల కార్మికులు పనిచేస్తున్నారా అనే అంశాన్ని పరిశీలించారు.బాల కార్మికులు లేని దుకాణాల యజమానులకు అవగాహన కల్పించి, "బాల కార్మికుల రహిత దుకాణం" స్టిక్కర్లను అంటించడం జరిగింది. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఎక్కడైనా బాల కార్మికులు కనిపించినట్లయితే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రతినిధి చంద్రప్రకాశ్ రెడ్డి, సీడీపీఓలు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్, బాలల పరిరక్షణ సిబ్బంది శాంత, తిరుపతి, సాదినేని రమేష్, కార్మిక శాఖ అధికారులు, పోలీసు టాస్క్ ఫోర్స్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### "మన బడి - మన బాధ్యత, స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూన్ 12:**




కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ గారి పిలుపుమేరకు కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 2వ డివిజన్ తీగలగుట్టపల్లిలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించనున్న

**"మన బడి - మన బాధ్యత, స్వచ్ఛ పాఠశాల"**

కార్యక్రమ ఏర్పాట్లను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్వహించిన టిఫిన్ బైఠక్‌లో డివిజన్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాఠశాల ఆవరణతో పాటు పరిసర ప్రాంతాలను సందర్శించి పరిశుభ్రత, పారిశుద్ధ్య ఏర్పాట్లను సమీక్షించారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉండటం విద్యార్థుల ఆరోగ్యానికి, విద్యాభివృద్ధికి ఎంతో అవసరమని మేయర్ పేర్కొన్నారు.నేడు నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) చేశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు, డివిజన్ అభివృద్ధి అంశాలపై కూడా చర్చించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొహర్రం ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం

**హైదరాబాద్, వెలుతురు జూన్ 12:**



పవిత్ర మొహర్రం మాసంలో నిర్వహించే చారిత్రాత్మక బీబీ-కా-ఆలం మాతం ఊరేగింపును ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ పిలుపునిచ్చారు.శుక్రవారం సాలార్ జంగ్ మ్యూజియం ఆడిటోరియంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఊరేగింపు మార్గంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.డబీర్‌పురాలోని బీబీ-కా-ఆలం అషూర్ ఖానా నుంచి ప్రారంభమయ్యే ఊరేగింపు చాదర్‌ఘాట్‌లోని మజీద్-ఎ-ఇలాహి వరకు కొనసాగుతుందని వివరించారు. ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ సదుపాయాలు, అదనపు పోలీసు బలగాల మోహరింపు, షీ టీమ్స్ పర్యవేక్షణ వంటి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఊరేగింపులో పాల్గొనే ఏనుగు భద్రత కోసం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసినట్లు పేర్కొంటూ, పశువైద్య బృందం, ట్రాంక్విలైజర్ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. మొత్తం ఊరేగింపును కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు.షియా కమ్యూనిటీ ప్రతినిధులు ప్రస్తావించిన రోడ్ల మరమ్మతులు, విద్యుత్ వైర్లు, తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, షియా మత పెద్దలు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టు

**మల్కాజ్‌గిరి, వెలుతురు జూన్ 12:**




నకిలీ పత్తి విత్తనాల విక్రయానికి పాల్పడుతున్న ముఠాను మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ టీమ్-2, త్రిమల్గెరి పోలీసులు పట్టుకున్నారు.ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రూ.30 లక్షల విలువైన నకిలీ విత్తనాలు, పౌచ్‌లు స్వాధీనం చేసుకున్నారు.నిందితులు ప్రముఖ నర్మదా సాగర్ అగ్రి సీడ్స్ కంపెనీ బ్రాండ్‌ను పోలిన నకిలీ పౌచ్‌లను తయారు చేశారు.వాటిలో ధృవీకరణ లేని పత్తి విత్తనాలను ప్యాక్ చేసి రైతులకు విక్రయించేందుకు ప్రయత్నించారు.బోయిన్‌పల్లి వెజిటబుల్ మార్కెట్ యార్డు వద్ద వాహన తనిఖీల్లో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.12,800 నకిలీ పత్తి విత్తనాల పౌచ్‌లు, 2,000 కిలోల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు యెరువ బాలశౌరి రెడ్డి అలియాస్ శివారెడ్డి అని పోలీసులు తెలిపారు.అతనికి గతంలోనూ నకిలీ విత్తనాల కేసుల్లో సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలింది.ఆర్థిక ఇబ్బందుల కారణంగా అక్రమ లాభాల కోసం ఈ కుట్ర పన్నినట్లు వెల్లడైంది.నకిలీ పౌచ్‌ల డిజైన్‌ను గ్రాఫిక్ డిజైనర్ రూపొందించగా, ప్రింటింగ్ సంస్థలో ముద్రించారు.బండ్లగూడలోని కార్యాలయంలో నిల్వ ఉంచిన విత్తనాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నకిలీ విత్తనాలు రైతులకు తీవ్ర నష్టాలు కలిగిస్తాయని పోలీసులు హెచ్చరించారు.ఈ కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ అభినందించారు.

# క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది

**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు జూన్ 12:**




కరీంనగర్ నగరపాలక సంస్థ మరియు జిల్లా యువజన, క్రీడా శాఖ (DYSO) సంయుక్త ఆధ్వర్యంలో బాలబాలికల కోసం నిర్వహించిన ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని అన్నారు.మే 11న అంబేద్కర్ స్టేడియంలో ప్రారంభమైన ఈ వేసవి క్రీడా శిబిరం జూన్ 12 వరకు విజయవంతంగా కొనసాగిందని తెలిపారు. దాదాపు 17 క్రీడా అంశాలలో 28 మంది అనుభవజ్ఞులైన కోచ్‌ల ఆధ్వర్యంలో శిక్షణ అందించగా, ఈ ఏడాది రికార్డు స్థాయిలో సుమారు 1400 మంది బాలబాలికలు పాల్గొనడం సంతోషకరమని పేర్కొన్నారు.క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన మరియు క్రమశిక్షణను పెంపొందిస్తాయని మేయర్ తెలిపారు.

చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, క్రీడలు విద్యార్థులను మానసికంగా దృఢంగా తీర్చిదిద్దుతాయని అన్నారు.శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు నగరపాలక సంస్థ తరఫున పాలు, గుడ్లు, అరటిపండ్లు, తాగునీరు వంటి పౌష్టికాహార సదుపాయాలు కల్పించడంతో పాటు కోచ్‌లకు తగిన గౌరవ వేతనం అందించినట్లు వివరించారు.భవిష్యత్తులో కరీంనగర్‌కు చెందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించేలా అవసరమైన ప్రోత్సాహం, వసతులు కల్పించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని మేయర్ స్పష్టం చేశారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు రాబోయే రోజుల్లో 3 నుంచి 5 ప్రధాన క్రీడా అంశాలలో ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో నిరంతర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా శిబిరాన్ని విజయవంతం చేసిన జిల్లా క్రీడా శాఖ అధికారులను, కోచ్‌లను, తల్లిదండ్రులను, పాల్గొన్న విద్యార్థులను మరియు ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మేయర్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్ రవీందర్ సింగ్,అడిషనల్ కలెక్టర్ సువార్త మరియు మహమ్మద్ ఆయాజ్,DYSO శ్రీనివాస్ గౌడ్,ఒలింపిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ జనార్ధన్ రెడ్డి,SGF సెక్రెటరీ వేణు గోపాల్, నగరపాలక సంస్థ అధికారులు, కో-ఆప్షన్ సభ్యులు, క్రీడాకారులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూన్ 12:**



కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా 1వ డివిజన్ అరెపల్లిలో మున్సిపల్ సాధారణ నిధుల నుండి రూ.27 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రైన్ మరియు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ గారు శంకుస్థాపన చేశారు. ఈ పనుల ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి, డ్రైనేజీ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.అనంతరం 26వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధుల నుండి చేపట్టనున్న పూడికతీత (Silt Removal) పనులను ప్రారంభించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు కాలువల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా పూడికతీత పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.నగర అభివృద్ధే లక్ష్యంగా ప్రతి డివిజన్‌లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నగరపాలక సంస్థ నిరంతరం పనిచేస్తోందని మేయర్ గారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ బారి అపర్ణ జితేందర్ గారు, 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ గారు, కార్పొరేటర్ బండారి వేణు గారు, కో-ఆప్షన్ సభ్యులు చిగిరి వెంకటమ్మ గారు, సరిల్ల ప్రసాద్ గారు, కొంపల్లి రమణ్ గారు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

# నేర పరిశోధనలో కొత్త అధ్యాయం: సీఐడీలో అత్యాధునిక కంప్యూటర్, షీ సైబర్ ల్యాబ్‌లు

- కృత్రిమ మేధస్సు ఆధారిత స్మార్ట్ క్రైమ్ అనాలిటిక్స్ సిస్టమ్‌ను ప్రారంభించిన డీజీపీ సి.వి. ఆనంద్
- మాట్లాడే వ్యక్తిని గుర్తించి ఆటోమేటిక్‌గా జూమ్ చేసే స్మార్ట్ కెమెరాలు..
- ఆడియో, వీడియో డిజిటల్ రికార్డింగ్ సదుపాయం
- డిజిటల్ బోర్డుపై సమాచారాన్ని టెక్స్ట్‌గా మార్చే ఏఐ సాంకేతికత..
- వేగంగా క్రైమ్ మ్యాపింగ్, నేర ధోరణుల విశ్లేషణ
- బాధితులు, ఫిర్యాదుదారుల అభిప్రాయాల నమోదు..
- సీసీటీఎన్ఎస్ వేదికగా డేటా నిర్వహణ మరింత సులభం
- సాంకేతిక వినియోగంలో దేశానికే ఆదర్శం తెలంగాణ పోలీస్..

**హైదరాబాద్, వెలుతురు జూన్ 12:**



సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న తరుణంలో నేరాల స్వరూపం కూడా వేగంగా మారుతోందని, అలాంటి పరిస్థితుల్లో ఆధునిక సాంకేతికతను వినియోగించడమే సమర్థవంతమైన పోలీసింగ్‌కు మూల సూత్రమని రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) శ్రీ సి.వి. ఆనంద్ అన్నారు. నేర నియంత్రణ, దర్యాప్తు, సైబర్ నేరాల ఛేదన, డేటా విశ్లేషణ వంటి రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు షీ సైబర్ ల్యాబ్‌ను డీజీపీ శుక్రవారం నాడు ప్రారంభించారు. కృత్రిమ మేధస్సు ఆధారిత స్మార్ట్ క్రైమ్ అనాలిటిక్స్, డేటా మేనేజ్‌మెంట్, స్మార్ట్ కాన్ఫరెన్స్ సదుపాయాలతో రూపొందించిన ఈ వ్యవస్థ నేర పరిశోధనలో కొత్త ఒరవడికి నాంది పలుకుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

తెలంగాణ పోలీస్ శాఖ సాంకేతిక వినియోగంలో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించిందని డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ పోలీసులు వినూత్న ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాల నియంత్రణ, డిజిటల్ ఫోరెన్సిక్ దర్యాప్తు, డేటా ఆధారిత పోలీసింగ్, క్రైమ్ అనాలిటిక్స్ రంగాల్లో తెలంగాణ పోలీస్ శాఖ విశేష పురోగతి సాధించిందని వివరించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు నేరాలపై వేగవంతమైన చర్యలు తీసుకునేందుకు వీలుగా ఇటీవల ఏర్పాటు చేసిన 'టీ-స్పార్క్' వంటి సాంకేతిక బృందాలు పోలీసింగ్‌లో ఆధునిక విధానాలను ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు.

సీఐడీ కార్యాలయంలో ప్రారంభించిన ఈ అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లో అనేక వినూత్న సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. సమావేశాల్లో మాట్లాడుతున్న వ్యక్తిని ఇక్కడి స్మార్ట్ కెమెరా స్వయంగా గుర్తించి అతని వైపు తిరగడంతో పాటు, మాట్లాడే వ్యక్తిపై ఆటోమేటిక్‌గా జూమ్ అవుతూ వీడియో, ఆడియో రికార్డింగ్ చేస్తుంది. చర్చించిన అంశాలను డిజిటల్ రూపంలో భద్రపరచడంతో పాటు అవసరమైనప్పుడు తిరిగి విశ్లేషించే అవకాశం కల్పిస్తుంది. అదేవిధంగా మానిటర్ లేదా డిజిటల్ బోర్డుపై ఇచ్చిన సమాచారాన్ని గుర్తించి టెక్స్ట్, ఆడియో లేదా నివేదిక రూపంలో మార్చగల సామర్థ్యం ఈ వ్యవస్థకు ఉంది. కృత్రిమ మేధస్సు సాయంతో సమాచారాన్ని విశ్లేషించి క్రైమ్ మ్యాపింగ్, డేటా ఫిల్టరింగ్, నేర ధోరణుల అధ్యయనం, కేసుల సమీక్ష వంటి అంశాలను మరింత వేగవంతంగా, ఖచ్చితంగా నిర్వహించవచ్చు.

బాధితులు, ఫిర్యాదుదారుల అభిప్రాయాలను కూడా డిజిటల్ రూపంలో నమోదు చేసి భద్రపరచడం ఈ వ్యవస్థ ప్రత్యేకత. దీనివల్ల కేసుల పురోగతి, దర్యాప్తు నాణ్యత, ప్రజల స్పందన వంటి అంశాలపై సమగ్ర విశ్లేషణ చేయడం సులభమవుతుంది. అలాగే క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్) వేదికలో కేసుల నమోదు, డేటా నిర్వహణ, విశ్లేషణ, ధృవీకరణ, అవసరమైన సవరణలు వంటి ప్రక్రియలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ సాంకేతిక వ్యవస్థ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ఈ ఆధునిక సాంకేతిక వ్యవస్థల ద్వారా నేర పరిశోధనలో ఖచ్చితత్వం పెరగడంతో పాటు దర్యాప్తు ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారుతుందని, భవిష్యత్తులో తెలంగాణ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడంలో ఈ ల్యాబ్‌లు కీలక మైలురాయిగా నిలుస్తాయని డీజీపీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీజీ ఏసీబీ & సీఐడీ శ్రీమతి చారుసిన్హా, డీఐజీలు నవీన్ కుమార్, నారాయణ నాయక్, పరిమళ హనా నూతన్, ఎస్పీ మద్దిపాటి శ్రీనివాస్, సీఐడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘమే అంతిమ వేదిక

- మీనాక్షి  నామినేషన్ వివాదంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు
- కాంగ్రెస్ నేత మీనాక్షీ నటరాజన్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ
- రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేత
- ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో కోర్టుల జోక్యానికి నిరాకరణ
- ఆర్ఓ నిర్ణయంపై అభ్యంతరాలుంటే ఈసీఐని ఆశ్రయించాలని సూచన
- ఎన్నికల సంఘానికే పూర్తి పరిష్కారాధికారమని స్పష్టీకరణ
- ఎన్నికల షెడ్యూల్‌ను ప్రభావితం చేసే ఆదేశాలు ఇవ్వలేమన్న ధర్మాసనం
- జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అతుల్ చందూర్‌కర్ ధర్మాసనం విచారణ
- చిన్న కేసును కారణంగా చూపి నామినేషన్ తిరస్కరించారన్న సింఘ్వీ
- ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాతే న్యాయపరమైన సవాళ్లకు అవకాశం
- దేశవ్యాప్తంగా ఎన్నికల వివాదాలకు మార్గదర్శకంగా నిలిచే తీర్పు



**న్యూఢిల్లీ వెలుతురు జూన్ 12:**

దేశంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో నామినేషన్ తిరస్కరణలకు సంబంధించి న్యాయస్థానాల జోక్యంపై సుప్రీంకోర్టు కీలక స్పష్టత ఇచ్చింది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థి నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించిన సందర్భంలో నేరుగా కోర్టులను ఆశ్రయించడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. అలాంటి సందర్భాల్లో ఎన్నికల సంఘమే సరైన వేదిక అని పేర్కొంటూ కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షీ నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం కొట్టివేసింది.రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఎన్నికల ప్రక్రియ స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థ పరిధిలో కొనసాగుతుందని, ఆ దశలో కోర్టులు జోక్యం చేసుకోవడానికి రాజ్యాంగపరమైన పరిమితులు ఉన్నాయని స్పష్టం చేసింది.విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల షెడ్యూల్ అమల్లో ఉన్న సమయంలో సుప్రీంకోర్టు లేదా ఇతర న్యాయస్థానాలు నామినేషన్‌లను పునరుద్ధరించిన ఉదాహరణలు ఏమైనా ఉన్నాయా అని పిటిషనర్ తరపు న్యాయవాదులను ప్రశ్నించింది. ఎన్నికల నిర్వహణ బాధ్యత పూర్తిగా ఎన్నికల సంఘానిదేనని, అందువల్ల రిటర్నింగ్ అధికారి నిర్ణయాలను పరిశీలించే ప్రాథమిక అధికారం కూడా ఎన్నికల సంఘానికే ఉంటుందని పేర్కొంది.పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ విస్తృతంగా వాదనలు వినిపించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ప్రతి కేసును అఫిడవిట్‌లో వెల్లడించాల్సిన అవసరం లేదని, రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష పడే అవకాశం ఉన్న తీవ్రమైన క్రిమినల్ కేసులను మాత్రమే వెల్లడించాలని నిబంధనలు చెబుతున్నాయని వివరించారు.మీనాక్షీ నటరాజన్‌పై ఎలాంటి తీవ్రమైన క్రిమినల్ కేసులు లేవని, ఆమెకు ఎటువంటి శిక్ష కూడా విధించలేదని సింఘ్వీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేవలం ఒక చిన్న వివాదానికి సంబంధించిన సమన్లను కారణంగా చూపి నామినేషన్‌ను తిరస్కరించడం చట్టబద్ధం కాదని వాదించారు. దీనివల్ల అర్హత కలిగిన అభ్యర్థి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు.అయితే ఈ వాదనలను పరిశీలించిన ధర్మాసనం ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై స్టే ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. నామినేషన్ పరిశీలనలో జరిగిన లోపాలపై చట్టంలో ఇప్పటికే ప్రత్యామ్నాయ పరిష్కార వ్యవస్థలు ఉన్నాయని పేర్కొంది. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు కోర్టులు ఈ దశలో జోక్యం చేసుకోవడం సరికాదని అభిప్రాయపడింది.పిటిషన్‌ను కొట్టివేస్తూనే సుప్రీంకోర్టు కీలక సూచనలు చేసింది. నామినేషన్ తిరస్కరణపై అభ్యంతరాలుంటే వెంటనే భారత ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని మీనాక్షీ నటరాజన్‌కు సూచించింది. అవసరమైన ఆధారాలను ఎన్నికల సంఘం ముందు ఉంచి న్యాయం కోరవచ్చని తెలిపింది. ఒకవేళ అక్కడ కూడా అనుకూల నిర్ణయం రాకపోతే ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత ఎన్నికల పిటిషన్ రూపంలో చట్టపరమైన పరిహారం కోరే అవకాశం ఉంటుందని గుర్తుచేసింది.సుప్రీంకోర్టు తాజా తీర్పు కేవలం ఒక వ్యక్తి కేసుకు మాత్రమే పరిమితం కాకుండా భవిష్యత్ ఎన్నికల వివాదాలకు కూడా కీలక మార్గదర్శకంగా మారే అవకాశం కనిపిస్తోంది.

నామినేషన్ తిరస్కరణలపై వెంటనే కోర్టులను ఆశ్రయించి ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే ప్రయత్నాలకు ఈ తీర్పు చెక్ పెట్టినట్లయిందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ అమల్లో ఉన్నంత వరకు ఎన్నికల సంఘమే ప్రధాన వేదిక అని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది.

# బేబీ ఆర్యాంశ్‌కు సీఎం రేవంత్ అండ
## సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సాయం హామీ

- ఎస్ఎమ్ఏ టైప్-2తో పోరాడుతున్న చిన్నారికి ప్రభుత్వ భరోసా
- ఉత్తమ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి
- సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి సాయం అందజేస్తామని ప్రకటన
- ప్రాణాలను కాపాడే ఇంజెక్షన్‌కు రూ.1.5 కోట్ల అవసరం
- ఇప్పటికే ప్రజల సహకారంతో రూ.75 లక్షలు సమీకరించిన తల్లిదండ్రులు
- మిగిలిన నిధుల కోసం ప్రభుత్వ సహాయంపై ఆశలు
- చిన్నారి పరిస్థితిని సీఎం దృష్టికి తీసుకెళ్లిన యూట్యూబర్ ఆదిరెడ్డి
- సోషల్ మీడియా పోస్టుకు వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి
- ఆర్యాంశ్ తల్లిదండ్రులను సంప్రదించనున్న సీఎంఆర్ఎఫ్ అధికారులు
- చిన్నారి పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించిన సీఎం



**హైదరాబాద్ వెలుతురు జూన్ 12:**

స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (ఎస్ఎమ్ఏ) టైప్–2 వ్యాధితో బాధపడుతున్న ఏడాది వయసున్న చిన్నారి ఆర్యాంశ్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. చిన్నారికి అవసరమైన అత్యుత్తమ వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించారు.తెలంగాణకు చెందిన ఆర్యాంశ్ అరుదైన జన్యుపరమైన వ్యాధి అయిన ఎస్ఎమ్ఏ టైప్–2తో బాధపడుతున్నాడు. చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు అత్యంత ఖరీదైన ప్రత్యేక ఇంజెక్షన్ అవసరమని వైద్యులు సూచించారు. ఈ ఇంజెక్షన్ కోసం సుమారు రూ.1.5 కోట్ల వ్యయం అవుతుందని తెలుస్తోంది. ఆసుపత్రి వైద్యుల సూచనల మేరకు జూన్ 20లోపు ఇంజెక్షన్ స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉండగా, జూలై నెలాఖరులోగా చికిత్స పూర్తి చేయాల్సి ఉంది.చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు తల్లిదండ్రులు ప్రజల సహకారం కోరగా, దాతల నుంచి విశేష స్పందన లభించింది. ఇప్పటివరకు సుమారు రూ.75 లక్షలు సమీకరించగలిగారు. అయితే చికిత్స పూర్తిచేయడానికి మరో రూ.75 లక్షలు అవసరమవుతుండటంతో మిగిలిన నిధుల కోసం ప్రభుత్వ సహాయంపై ఆశలు పెట్టుకున్నారు.చిన్నారి ఆరోగ్య పరిస్థితి, చికిత్సకు అవసరమైన భారీ నిధుల విషయాన్ని ప్రముఖ యూట్యూబర్ ఆదిరెడ్డి సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, చిన్నారికి అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.''చిన్నారి ఆర్యాంశ్‌కు ఉత్తమ చికిత్స అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. సీఎంఆర్ఎఫ్ అధికారులు తల్లిదండ్రులను సంప్రదిస్తారు. ఆర్యాంశ్ పూర్తిగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను'' అని సీఎం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ అధికారులు వెంటనే చిన్నారి కుటుంబ సభ్యులను సంప్రదించి అవసరమైన వివరాలు సేకరించనున్నారు. సీఎం స్పందనతో చిన్నారి కుటుంబంలో ఆశలు చిగురించగా, ఆర్యాంశ్ త్వరగా కోలుకోవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

# చేనేత సమస్యలపై మంత్రిని కలిసిన పద్మశాలి సంఘం నాయకులు

- సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి కమిషనర్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 12:**





పలు చేనేత సమస్యలపై చేనేత వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావును శుక్రవారం ఆయన నివాసంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి, అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి కండగట్ల స్వామి గడ్డం జగన్నాథం, నాయకత్వంలో  కలిసి వివరించగా వెంటనే చేనేత కమిషనర్ శైలజ రామయ్య ఫోన్ చేసి వీరి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఇట్టి విషయమై సెక్రటేరియట్ లో ఉన్న కమిషనర్ను ప్రతినిధి బృందం కలిసి పలు సమస్యలను వారికి విన్నవించారు వీటిలో ప్రధానంగా రెండు లక్షల 50 వేల బెడ్ షీట్లు మరియు కార్పెట్లు ఆర్డర్ ఇచ్చామని దానితోపాటు మరో రెండు లక్షలకు త్వరలో ఆర్డర్ ఇవ్వనున్నట్లు తెలిపారు  రానున్న సంవత్సరానికి కావలసిన ఆర్డర్లను కూడా రూపకల్పన చేస్తున్నట్టు తెలిపారు.అంతే కాకుండా మార్చి 2026 నుండి చేనేత సహకార సంఘాల్లో పనిచేసే కార్మికులకు పెంచిన వేతనాలు వర్తిస్తాయని తెలిపారు షూటింగ్ సెట్టింగ్ మెటీరియల్ సహకార సంఘాల్లో ఉత్పత్తి చేసి  తయారుగా ఉన్న వాటిని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. చేనేత సహకార సంఘాలు ఉత్పత్తి చేసే జనరల్ వెరైటీలు మరియు లివరీలు వాటి యొక్క రేట్లు పెంచాలని కోరగా త్వరలో వాటిపై సమీక్షించి పెంచుతారని హామీ ఇచ్చారు.  సంఘాలకు చెల్లించాల్సిన 146 కోట్ల పెండింగ్ బిల్లులను వివిధ శాఖల ద్వారా రావాలని వాటిని రాబట్టడానికి ప్రయత్నం చేస్తున్నామని త్వరలో వాటిని చెల్లిస్తామని తెలిపారు. త్రిఫ్ట్ మరియు 59 సంవత్సరాల పైబడి చనిపోయిన చేనేత కార్మికులకు డిపార్ట్మెంట్ ద్వారా వచ్చే ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని కోరగా త్వరలోనే చెల్లిస్తామని తెలిపారు. సహకార సంఘాలకు పెండింగ్లో ఉన్న పాలా వడ్డీ బిల్లులను చెల్లించాలని కోరగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. సొసైటీలకు క్యాష్ క్రెడిట్ లిమిట్ పెంపుదలకు సంబంధించిన విషయంపై నాబార్డుకు ఫైల్ పెట్టామని త్వరలో పెరుగుతుందని హామీ ఇచ్చారు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నందుకు మంత్రికి మరియు కమిషనర్ కు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో , అఖిల భారత పద్మశాలి యువజన విభాగం జాతీయ ఇంచార్జ్ అవ్వారి భాస్కర్, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచందర్ రావు, చేనేత విభాగం అధ్యక్షులు కందగట్ల బిక్షపతి, ఉపాధ్యక్షులు గుర్రం శ్రావణ్, వద్నాల నరేందర్, నేత, యువజన విభాగం అధ్యక్షులు, అంబటి శ్రీనివాస్, వరంగల్ జిల్లా అధ్యక్షులు ఆడెపు రవీందర్, ఎల్బీనగర్ అధ్యక్షులు పున్న గణేష్ నేత హనుమకొండ అధ్యక్షులు బచ్చు ఆనందం, వైద్యం రాజగోపాల్,, డి ఎస్ మూర్తి, సంగారెడ్డి అధ్యక్షులు కొప్పెర హరి హర కిషన్, మాచర్ల మహేందర్ పెద్దపల్లి ఆడెపు సుధాకర్, సదానందం, భక్తుల రమేష్  తాటి ఎల్లయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

- మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, పాలమూరు-రంగారెడ్డి,  దిండి ఎత్తిపోతల పథకాల పురోగతిపై కమిషనర్ సమీక్ష

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 12:**

సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం, పరిహారం చెల్లింపుల ప్రక్రియలను వేగవంతం చేసి, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ పునరావాసం, పునర్ ఉపాధి మరియు భూసేకరణ (R&R & LA) కమిషనర్ కె. శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు.శుక్రవారం సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు కలెక్టరేట్‌కు విచ్చేసిన కమిషనర్ శ్రీ కె. శివకుమార్ నాయుడుకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)  చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) అనంత్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) సునీల్ ఘన స్వాగతం పలికారు.అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, దిండి ఎత్తిపోతల పథకం తదితర ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. భూసేకరణ, అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలు, పెండింగ్ కేసుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సాగునీటి ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో కందుకూరు, ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఆమనగల్లు, మాడ్గుల్ తహసీల్దార్లు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# 17 ఏళ్ల తర్వాత బెంగాల్‌కు టాటాలు

- పెట్టుబడులపై సువేందు అధికారి కీలక వ్యాఖ్యలు
- టాటా గ్రూప్‌ను తిరిగి పశ్చిమబెంగాల్‌కు తీసుకొస్తామన్న సువేందు అధికారి
- రాష్ట్ర పారిశ్రామిక పునరుజ్జీవనానికి ప్రత్యేక కార్యాచరణ
- భారీ పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కల్పనపై దృష్టి
- సింగూర్ వివాదం తర్వాత టాటాలు బెంగాల్‌కు దూరం
- గత తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్న హామీ



**పశ్చిమబెంగాల్ వెలుతురు జూన్ 12:**


పశ్చిమబెంగాల్‌లో పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపునివ్వాలనే లక్ష్యంతో టాటా గ్రూప్‌ను తిరిగి రాష్ట్రానికి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు బీజేపీ సీనియర్ నేత, పశ్చిమబెంగాల్ ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి వెల్లడించారు. సింగూర్‌లో టాటా మోటార్స్ నానో ప్రాజెక్ట్ నిలిచిపోయిన దాదాపు 17 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో మళ్లీ పెద్దఎత్తున పారిశ్రామిక పెట్టుబడులు రాబట్టేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.పశ్చిమబెంగాల్ ఒకప్పుడు దేశంలోని ప్రముఖ పారిశ్రామిక కేంద్రాల్లో ఒకటిగా నిలిచిందని గుర్తు చేసిన ఆయన, గత కొన్నేళ్లలో పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోవడంతో ఉపాధి అవకాశాలు తగ్గాయని అన్నారు. ఈ పరిస్థితిని మార్చి రాష్ట్రానికి తిరిగి పారిశ్రామిక వైభవం తీసుకురావడమే తమ లక్ష్యమని చెప్పారు.టాటా గ్రూప్ వంటి ప్రముఖ పారిశ్రామిక సంస్థలను ఆకర్షించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కొత్త దిశను చూపించాలనుకుంటున్నామని సువేందు అధికారి తెలిపారు. గతంలో సింగూర్, నందిగ్రామ్ ప్రాంతాల్లో చోటుచేసుకున్న వివాదాల నుంచి పాఠాలు నేర్చుకున్నామని, భూసేకరణ అంశంలో రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

### టాటాలు బెంగాల్‌ను ఎందుకు విడిచిపెట్టాయి?

2006లో పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీ జిల్లా సింగూర్‌లో టాటా మోటార్స్ తన ప్రతిష్ఠాత్మక 'నానో' కార్ల తయారీ కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం అప్పటి వామపక్ష ప్రభుత్వం సుమారు వెయ్యి ఎకరాల భూమిని సేకరించింది. అయితే భూసేకరణ ప్రక్రియపై రైతులు, స్థానిక ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.ఆ సమయంలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో భారీ ఆందోళనలు జరిగాయి. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా నెలల తరబడి నిరసనలు కొనసాగడంతో ప్రాజెక్ట్ అమలులో అనిశ్చితి నెలకొంది. చివరకు 2008 అక్టోబరులో టాటా గ్రూప్ సింగూర్ ప్రాజెక్ట్‌ను ఉపసంహరించుకుని గుజరాత్‌లోని సానంద్‌కు తరలించింది.తరువాత ఈ వ్యవహారంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా 2016లో కీలక తీర్పు వెలువరించింది. సింగూర్‌లో జరిగిన భూసేకరణ చట్టబద్ధం కాదని పేర్కొంటూ ఆ భూములను రైతులకు తిరిగి అప్పగించాలని ఆదేశించింది. ఈ తీర్పు దేశవ్యాప్తంగా భూసేకరణ అంశంలో కీలక మైలురాయిగా నిలిచింది.ప్రస్తుతం రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించి, పరిశ్రమలను తిరిగి ఆకర్షించడం ద్వారా పశ్చిమ బెంగాల్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని సువేందు అధికారి తెలిపారు. టాటా గ్రూప్ మళ్లీ బెంగాల్‌లో పెట్టుబడులు పెడితే రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త ఊపు లభించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# దోచుకోవడం దాచుకోవడం మీ నైజం

- ప్రజా దనంతో మీరు ఫామ్ హౌస్ లు కట్టుకొని పేద విద్యార్థుల భవిష్యత్, సంక్షేమాన్ని విస్మరించారు
- రూ.687.78 కోట్ల టెండర్‌ను రూ.2,000 కోట్ల కుంభకోణమంటారా?
- హరీశ్ రావు ఆరోపణలు పూర్తిగా అవాస్తవం అబద్ధాలు
- బీఆర్ఎస్ హయాంలో LIDCAPకు రూ.40.21 లక్షలు... కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండేళ్లలోనే రూ.51 కోట్ల పనులు
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




**హైదరాబాద్, వెలుతురు జూన్ 12:**

గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులకు సదుపాయాల కల్పన కోసం చేపట్టిన కొనుగోలు ప్రక్రియపై మాజీ మంత్రి బి ఆర్ ఎస్ పార్టీ శాసనసభ పక్ష నాయకులు టి. హరీశ్ రావు చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు.శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ గారితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మొత్తం టెండర్ విలువ రూ.687.78 కోట్లు మాత్రమే. మరి రూ.2,000 కోట్ల కుంభకోణం అనే అంకె ఎక్కడి నుంచి వచ్చిందో హరీశ్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలి.ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం. ఆధారాలు ఉంటే విచారణ సంస్థలకు ఇవ్వాలి, లేకపోతే ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలి.ఈ టెండర్ ప్రక్రియ పూర్తిగా తెలంగాణ ప్రభుత్వ ఈ–ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా, జాతీయ స్థాయి పోటీ టెండర్ల ద్వారా నిర్వహించబడింది. దేశవ్యాప్తంగా 27 బిడ్లు వచ్చాయి. టెక్నికల్ అర్హతలు, ఫైనాన్షియల్ బిడ్ల పరిశీలన అనంతరం L1 విధానంలో టెండర్లు ఖరారు చేశాం.ఏ ఒక్క సంస్థకూ నామినేషన్ పద్ధతిలో పని ఇవ్వలేదు. గుజరాత్ కాంట్రాక్టర్ కథలు పూర్తిగా కల్పితం. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ సహా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంస్థలు పోటీ పడి టెండర్లు దక్కించుకున్నాయి. దక్కించున్న వాటిలో గుజరాత్ కంపెనీ అసలే లేదు.హైకోర్టు సైతం కేంద్రీకృత కొనుగోలు విధానంపై ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదు.

**ప్రభుత్వ రంగ సంస్థలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో LIDCAPకు కేవలం రూ.40.21 లక్షల విలువైన పనులు మాత్రమే ఇచ్చారు.కానీ మా ప్రభుత్వం కేవలం రెండేళ్లలో రూ 51 కోట్ల రూపాయల వర్క్ ఆర్డర్ ను LIDCAP కు ఇచ్చాం.దీని బట్టి ఎవరు ఏ సంస్థలకు పెద్దపీట వేశారు అర్థం చేసుకోవచ్చు అని దీని తెలంగాణ ప్రజలు గమనించాలి.ప్రజా ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ పడదు. తెలంగాణ పేద పిల్లలకు దేశంలోనే అత్యుత్తమ విద్యా, వసతి, సంక్షేమ సదుపాయాలు అందించడమే మా లక్ష్యం

**టైలు, బెల్టులు, ఐడీ కార్డుల మొత్తం ఆర్డర్‌ను TGLIPCకు అప్పగించాం**

**యూనిఫాం వస్త్రం, కార్పెట్లు, దుప్పట్లు, బెడ్డింగ్ సామగ్రిలో గణనీయమైన వాటాను TGSCOకు కేటాయించాం**

**నోటుబుక్‌ల సరఫరాను తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్‌కు అప్పగించాం**

**14 వేల మంది మహిళా టైలర్లకు యూనిఫాం కుట్టు పనులు కల్పించి ఉపాధి అవకాశాలు కల్పించాం**

**27 లక్షల మంది విద్యార్థులకు తొలిసారి సమగ్ర సదుపాయాలు**

**తెలంగాణ చరిత్రలో తొలిసారిగా గురుకులాలు, కేజీబీవీలు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరీతి నాణ్యతతో సదుపాయాలు అందిస్తున్నాం.**

తెల్లటి యూనిఫాం, తెల్లటి బూట్లు, తెల్లటి సాక్సులు, స్కూల్ బ్యాగ్, బెల్ట్, టై, ట్రంక్ బాక్స్, బెడ్డింగ్ కిట్, పీటీ డ్రస్, నైట్ డ్రస్ వంటి సమగ్ర కిట్ అందజేస్తున్నాం. దాదాపు 27 లక్షల మంది విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందనున్నారు.

విద్యార్థుల సంక్షేమంలో ప్రజా ప్రభుత్వం కొత్త అధ్యాయం

డైట్ ఛార్జీలు పెంచాం

కాస్మెటిక్ ఛార్జీలు పెంచాం

టీచింగ్, నాన్–టీచింగ్ సిబ్బంది బకాయిలు చెల్లిస్తున్నాం

అద్దె భవనాల బిల్లులను ప్రతినెల సకాలంలో విడుదల చేస్తున్నాం.

ప్రతి జిల్లాలో మరమ్మతులు, తాగునీరు, పారిశుద్ధ్య పనుల కోసం కలెక్టర్లకు ప్రత్యేక నిధులు అందుబాటులో ఉంచాం.

బీఆర్ఎస్ నాయకులకు మంత్రి అడ్లూరి సూటి ప్రశ్నలు

పదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం ఎన్ని కొత్త హాస్టళ్లు నిర్మించారు?★

డైట్ ఛార్జీలు ఎందుకు పెంచలేదు?

కాస్మెటిక్ ఛార్జీల పెంపు గురించి ఎందుకు ఆలోచించలేదు?

విద్యార్థులకు నాణ్యమైన సదుపాయాలు అందించే ప్రయత్నాన్ని ఎందుకు జీర్ణించుకోలేకపోతున్నారు?

గురుకుల విద్యార్థులు మంచి బట్టలు వేసుకోవడం, మంచి సదుపాయాలు పొందడం బీఆర్ఎస్ నాయకులకు ఇబ్బందిగా ఉందా?

అక్రమాలు జరిగాయని చెబుతున్నట్లయితే ఆధారాలు బయటపెట్టాలి. లేకపోతే ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి.మైనారిటీ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ రూ.687.78 కోట్ల టెండర్‌ను రూ.2,000 కోట్ల కుంభకోణంగా చిత్రీకరించడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం.కేంద్రీకృత కొనుగోలు విధానం వల్ల నాణ్యత, పారదర్శకత, సమయానికి సరఫరా సాధ్యమవుతోంది.ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుంది. హరీష్ రావు వద్ద ఆధారాలు ఉంటే బయట పెట్టాలని మంత్రి అజారుద్దీన్ సవాల్ విసిరారు.

# ముగిసిన సైబరాబాద్ ప్రెస్ & పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్- 2026







- అద్భుత విజయాన్ని సాధించిన పోలీస్ హంటర్స్ జట్టు
- 92 పరుగులు, 2 వికెట్లతో అద్వైత్ ఆల్‌రౌండ్ షో.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు
- 180 పరుగులతో మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నరేష్

**సైబరాబాద్ వెలుతురు జూన్ 12:**

సైబరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సైబరాబాద్ ప్రెస్ & పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్–2026 శుక్రవారం రోజున విజయవంతంగా ముగిసింది. పోలీసు సిబ్బంది మరియు మీడియా ప్రతినిధుల మధ్య స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహించారు.టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పోలీస్ హంటర్స్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పోలీస్ హంటర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 224 పరుగులు చేసింది. జట్టు తరపున అద్వైత్ దూకుడైన బ్యాటింగ్‌తో 92 పరుగులు సాధించి జట్టు భారీ స్కోరు నమోదు చేయడంలో కీలక పాత్ర పోషించారు.అనంతరం 225 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన క్రైమ్ వారియర్స్ జట్టు పోలీస్ హంటర్స్ బౌలర్ల ధాటికి 73 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో పోలీస్ హంటర్స్ జట్టు ఘన విజయం సాధించి టోర్నమెంట్ ఛాంపియన్‌గా నిలిచింది.ఫైనల్ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన అద్వైత్ 92 పరుగులు చేయడంతో పాటు 2 వికెట్లు కూడా తీసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నారు. టోర్నమెంట్ మొత్తం 180 పరుగులు సాధించిన పోలీస్ హంటర్స్ ప్లేయర్ నరేష్ కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది.ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ విజేతలకు ట్రోఫీలు, వ్యక్తిగత అవార్డులు అందజేసి అభినందించారు. క్రీడా స్ఫూర్తితో పాల్గొన్న అన్ని జట్లను ప్రశంసించారు.ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్., మాట్లాడుతూ పోలీసు శాఖ ఉద్యోగం అయినా, మీడియా ఉద్యోగం అయినా నిరంతర ఒత్తిడితో కూడుకున్న వేనని, రాత్రి వేళల్లో కూడా విధుల నిర్వర్తిస్తూ ఉంటారని అన్నారు. అటువంటి పరిస్థితుల్లో పనిచేస్తున్న రెండు వర్గాల మధ్య పరస్పర అవగాహన, స్నేహపూర్వక వాతావరణం మరింత బలోపేతం కావాలనే ఉద్దేశంతో ఈ ప్రెస్ & పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్‌ను నిర్వహించామని తెలిపారు. మూడు రోజుల పాటు సైబరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో 10 జట్లతో నిర్వహించిన ఈ టోర్నమెంట్ విజయవంతం కావడానికి కృషి చేసిన అధికారులు, నిర్వాహకులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరినీ హృదయపూర్వకంగా అభినందించారు. మీడియా ప్రతినిధుల కోరిక మేరకే ఈ క్రికెట్ లీగ్‌ను నిర్వహించామని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తూ బ్యాడ్మింటన్ వంటి ఇతర క్రీడా పోటీలను కూడా నిర్వహిస్తామని సీపీ తెలిపారు. పోలీసు–మీడియా సంబంధాలను మరింత బలోపేతం చేసే వేదికగా ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీపీ డా. ఎం. రమేష్‌తో పాటు అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, హెడ్ క్వార్టర్ డీసీపీ సంజీవ్, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీలు హనుమంతరావు, షమీర్, ఆర్‌ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఘటన బాధిత బాలికకు ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి సీతక్క

- నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికను, కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్ వెలుతురు జూన్ 12:**

ఖమ్మం జిల్లాలో అత్యాచార యత్నానికి గురై తీవ్ర గాయాలతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క శుక్రవారం పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ఆమెకు ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, సిపిఐ ఫ్లోర్ లీడర్ కునంనేని సాంబ శివరావు, సిపిఐ ఏమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి బయట కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించారు.ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు చికిత్స అందిస్తున్న వైద్యుల నుంచి బాలిక ఆరోగ్య పరిస్థితిపై మంత్రి వివరాలు తెలుసుకున్నారు. బాలికకు అత్యుత్తమ వైద్యం అందిస్తున్నామని, వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని నిమ్స్ డైరెక్టర్ మంత్రికి వివరించారు.అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ, మొదట బాలిక భవనం పై నుంచి కిందపడిన ఘటనగా సమాచారం అందిందని, అయితే స్పృహలోకి వచ్చిన తర్వాత జరిగిన దారుణం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. తాత వయసులో ఉన్న వ్యక్తి ఇంత దుర్మార్గానికి పాల్పడటం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.ఘటన తెలిసిన వెంటనే ప్రభుత్వం స్పందించి బాలికకు మెరుగైన వైద్యం అందించేందుకు నిమ్స్‌కు తరలించినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం అవసరమైన అన్ని వైద్య సేవలు అందిస్తున్నామని, బాలిక పూర్తిగా కోలుకునే వరకు నిమ్స్‌లోనే ఉంచి అత్యుత్తమ చికిత్స అందిస్తామని చెప్పారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సహాయంగా రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అదేవిధంగా మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఇప్పటివరకు రూ.70 వేల తక్షణ సహాయం అందించారు.ఘటన జరిగిన నాటి నుంచి మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. కుటుంబానికి అండగా ఉండేందుకు ఖమ్మం జిల్లా డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విష్ణు వందనను నిమ్స్‌లోనే అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. బాధిత కుటుంబానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా ఖమ్మం పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి సీతక్క, నిందితుడికి త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చట్టపరంగా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు."ఇలాంటి దుర్మార్గులను మా ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదు. ఎంతటి రాజకీయ అండ ఉన్నా నిందితుడిని కఠినంగా శిక్షిస్తాం. చిన్నారి ప్రాణాలపై దాడి చేసిన ఈ అమానుష ఘటనకు బాధ్యుడైన వ్యక్తికి చట్టం ప్రకారం అత్యంత కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం" అని మంత్రి స్పష్టం చేశారు.సమాజం ఎంత అభివృద్ధి చెందుతుందో, అంతే స్థాయిలో మానవ విలువలు కూడా పెరగాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. మహిళలు, బాలికల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడదని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.





# మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రిని రేవంత్ రెడ్డి గారి అపాయింట్మెంట్ ఇప్పించాలని డీజీపీ కోరిన సర్పంచ్‌ల సంఘం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 12:**

మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు అడుగుతే అరెస్టులు నిర్బంధిస్తున్నారు కావున మా బిల్లులు ముఖ్యమంత్రి వారిని కల్పించి మా బిల్లుల సమస్యను పరిష్కరించాలని డీజీపీని కోరిన తెలంగాణ సర్పంచ్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీడిజిపి గారు మా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ ఎందుకంటే. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం 31 నెలలుగా మాజీ సర్పంచ్ల బిల్లులు చెల్లించడం లేదు మాజీ సర్పంచులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు మాజీ సర్పంచుల కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నవి మా బిల్లులు ఇవ్వాలని ఏ కార్యక్రమాలు చేసినా ముందస్తు అరెస్టులు చేస్తున్నారు ముఖ్యమంత్రి గారిని కలిసి వినతిపత్రం అందజేద్దామన్న అరెస్టు చేస్తున్నారు కావున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కల్పించి మా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాం కార్యక్రమంలో తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ సర్పంచ్ల సంఘం కార్యదర్శి కేశబోయిన మల్లయ్య యాదవ్ వై అరవింద్ రెడ్డి సముద్రాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల వేటలో 'కేంద్రం'...

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా బీజేపీపాలితా ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో అప్రజాస్వామిక పాలన సాగుతోందని మండిపడ్డారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బి.ఎల్.ఏ) అవగాహన శిక్షణ శిబిరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట క్రాస్ రోడ్డులో గల పీవీఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి.. కేంద్ర ప్రభుత్వ వైఖరిని, బీజేపీ రాజకీయ వ్యూహాలను ఎండగడుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు.

**'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం.. దొంగదారి చర్య!***

కేంద్ర ప్రభుత్వం చట్టం రూపంలో తీసుకువచ్చిన 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం లాంటిదని, ఇది ముమ్మాటికీ దొంగదారి చర్యేనని మంత్రి విమర్శించారు. "కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే బలంగా ఉందో, ఎక్కడైతే మనకు ఓట్లు ఎక్కువగా ఉన్నాయో.. అక్కడ ఒక పద్ధతి ప్రకారం దాదాపు 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్ ఓట్లు'గా చిత్రీకరించి, వాటిని జాబితా నుంచి తొలగించేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోంది. ఓటరు వయస్సులో స్వల్ప తేడాలున్నా, పేర్లలో స్పెల్లింగ్ మిస్టేక్స్ (రావుకు బదులు రెడ్డి, హుస్సేన్ బదులు శ్రీ అని పడటం) ఉన్నా.. వాటన్నింటినీ వంకగా చూపి ఓట్లను లేపేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే బీహార్, వెస్ట్ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో ఈ పద్ధతిని ప్రయోగించి సక్సెస్ అయ్యారు. అదే ఫార్ములాను ఇప్పుడు తెలంగాణలోనూ ప్రయోగించాలని చూస్తున్నారు. దీన్ని కాంగ్రెస్ సైనికులు గట్టిగా తిప్పికొట్టాలి" అని మంత్రి పిలుపునిచ్చారు.

**ఓట్లు.. నేడు ఏకంగా సీట్లే దొంగిలిస్తున్నారు!**

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ఉదంతాన్ని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "మీనాక్షి నటరాజన్ గారికి కావలసిన ఓట్ల కంటే 11 ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ కేవలం ఒక పాత ఎఫ్ఐఆర్ కాగితాన్ని సాకుగా చూపి, ఎన్నికల అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అక్రమంగా ఆమె నామినేషన్‌ను తిరస్కరింపజేశారు. ఈ రకంగా కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన ఒక రాజ్యసభ స్థానాన్ని వాళ్ళు దొంగిలించారు. నిన్నటి వరకు ఓట్లను దొంగిలించిన వాళ్ళు.. ఈరోజు ఏకంగా సీట్లనే దొంగిలించే దుస్థితికి కేంద్ర ప్రభుత్వం దిగజారింది" అని నిప్పులు చెరిగారు.

**సీబీఐ, ఈడీలతో బెదిరింపు రాజకీయాలు**

బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం దేశంలోని ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థలను వేట కుక్కల్లా వాడుకుంటోందని మంత్రి తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ చేతుల్లో ఉన్న సీబీఐ , ఈడీ , ఇన్‌కమ్ టాక్స్ సంస్థలను అడ్డం పెట్టుకుని, వేరే పార్టీల తరఫున గెలిచిన ప్రజాప్రతినిధులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చేందుకు కుట్రలు పన్నుతున్నారని, భారతదేశంలో ఎక్కడ బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నా ఇదే రకమైన దుర్మార్గపు పరిపాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రతి ఓటూ కాంక్రీట్ గోడ కావాలి..**

జూన్ 25 నుంచి జూలై 24 వరకు నెల రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే 'ఓట్ మ్యాపింగ్' ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. "ఉద్యోగాలు, చదువుల రీత్యా ఖమ్మం, హైదరాబాద్‌లలో ఉండే మన వాళ్ళు అధికారులు వచ్చినప్పుడు ఊర్లో లేరనే సాకుతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉంది. అధికారులు వచ్చే ముందే గ్రామంలో చాటింపు వేయించి వేరే ఊర్లలో ఉన్న మన ఓటర్లను రప్పించి ఓటు కాపాడుకోవాలి. మనకు దొంగ ఓట్లు అవసరం లేదు.. మనకున్న జనాదరణతో ప్రతి ఓటునూ ఒక కాంక్రీట్ గోడ లాగా కాపాడుకోవాలి" అని స్పష్టం చేశారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కాబోయే ప్రధానమంత్రి, మన నాయకుడు రాహుల్ గాంధీకి కార్యకర్తలంతా సైనికుల్లా అండగా నిలబడాలని, ఈ అక్రమ ఎస్ఐఆర్ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, పీసీసీ ప్రతినిధి సుధాకర్, ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్, ఏదులాపురం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, 291 బూత్‌ల బి.ఎల్.ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజ్యసభలో కొత్త సమీకరణాలు.. 24 స్థానాలు ఏకగ్రీవం

- **బీజేపీ నేత తరుణ్ చుగ్ సహా పలువురి ఏకగ్రీవ ఎన్నిక**
- **వైఎస్సార్ కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ**
- **ఒడిశాలో బీజేపీ బలపరిచిన రాజకీయ పరిణామాలు**
- **గుజరాత్, ఏపీల్లో ఎన్డీయే క్లీన్ స్వీప్**
- **కర్ణాటకలో కాంగ్రెస్ ఆధిక్యం కొనసాగింపు**

**ఢిల్లీ వెలుతురు జూన్ 12:**

రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల ప్రక్రియలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. మొత్తం 27 స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, పోటీ లేకపోవడంతో 24 మంది అభ్యర్థులు ముందుగానే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో ఈనెల 18న జరగాల్సిన పోలింగ్ అవసరం లేకుండానే అత్యధిక స్థానాలకు ఫలితాలు ఖరారయ్యాయి.ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్‌తో పాటు పలువురు ప్రముఖులు ఉన్నారు. ఎన్నికల అధికారులు గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందజేశారు.ఈ ఎన్నికలతో రాజ్యసభలో అధికార ఎన్డీయే కూటమి బలం మరింత పటిష్ఠమైంది. అదనంగా మూడు స్థానాలు కైవసం చేసుకోవడంతో కూటమి సంఖ్యాబలం పెరిగింది. మరోవైపు కాంగ్రెస్ ఐదు స్థానాలను గెలుచుకున్నప్పటికీ, మొత్తం బలంలో పరిమిత మార్పే నమోదైంది.ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే నాలుగు స్థానాలను కైవసం చేసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

రాష్ట్రంలో అధికార మార్పు ప్రభావం రాజ్యసభ ఎన్నికలపైనా కనిపించింది. గతంలో బలంగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ మూడు స్థానాలను కోల్పోవడం ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బగా మారింది.ఒడిశాలో కూడా రాజకీయ సమీకరణాలు మారాయి. మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీకి చెందిన నాయకుడు దేబాశిష్ సమంతరాయ్ బీజేపీలో చేరిన అనంతరం కమలం పార్టీ తరపున రాజ్యసభకు ఎన్నికయ్యారు. దీంతో ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభావం మరింత పెరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.గుజరాత్‌లోని నాలుగు స్థానాలన్నీ ఎన్డీయే ఖాతాలో చేరాయి. మధ్యప్రదేశ్‌లో మూడు స్థానాలన్నింటినీ బీజేపీ గెలుచుకుంది. రాజస్థాన్‌లో మూడు స్థానాల్లో రెండు స్థానాలను కమలదళం సొంతం చేసుకుంది.కర్ణాటకలో మాత్రం కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగింది. అక్కడ మూడు స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోగా, ఒక స్థానాన్ని బీజేపీ దక్కించుకుంది.

అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లో ఒక్కో స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. మేఘాలయలో ఎన్డీయే భాగస్వామి ఎన్‌పీపీ విజయం సాధించింది.మహారాష్ట్ర, ఒడిశాలో ఎన్డీయేకు ఒక్కో స్థానం దక్కగా, తమిళనాడులో కాంగ్రెస్ విజయం సాధించింది. మొత్తం మీద తాజా రాజ్యసభ ఎన్నికలు

జాతీయ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తూ, పార్లమెంట్ ఎగువ సభలో ఎన్డీయే ప్రభావాన్ని మరింత బలోపేతం చేసినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

- **తెలంగాణను దేశ వ్యవసాయ దిక్సూచిగా నిలబెట్టడంలో పీజేటీఏయూ కీలక పాత్ర పోషించాలి**



**హైదరాబాద్ వెలుతురు జూన్ 12:**

రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని, "భారత హరిత విప్లవానికి దివంగత ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ అద్భుత సేవలు" అనే అంశంపై విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జాతీయ సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 1964లో స్థాపించబడిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆరు దశాబ్దాలకు పైగా వ్యవసాయ పరిశోధన, విద్య, విస్తరణ సేవల ద్వారా రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు. ఈ విశ్వవిద్యాలయ భవనాలను 1966లో అప్పటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ ప్రారంభించడం విశ్వవిద్యాలయ చరిత్రలో గర్వకారణమని పేర్కొన్నారు. 1960లలో దేశం ఎదుర్కొన్న తీవ్ర ఆహార సంక్షోభం నుంచి బయటపడటానికి శ్రీమతి ఇందిరా గాంధీ రాజకీయ నాయకత్వం, డా. ఎం.ఎస్. స్వామినాథన్ వంటి శాస్త్రవేత్తల కృషి కలిసి హరిత విప్లవానికి దారితీశాయని మంత్రి కొనియాడారు. ఆ విప్లవ ఫలితంగానే భారత్ నేడు ప్రపంచంలో అగ్రగామి ఆహార ధాన్య ఉత్పత్తి దేశంగా నిలిచిందన్నారు.గత 62 సంవత్సరాల్లో విశ్వవిద్యాలయం 525 పంట రకాలను అభివృద్ధి చేసిందని, తెలంగాణ సోనా, బీపీటీ–5204, ఎంటీయూ–1010 వంటి వరి రకాలు, డీహెచ్ఎం సిరీస్ మొక్కజొన్న సంకర రకాలు దేశవ్యాప్తంగా రైతుల ఆదరణ పొందాయని తెలిపారు. వేలాది మంది వ్యవసాయ పట్టభద్రులు, పరిశోధకులను తయారు చేసి వ్యవసాయ రంగానికి విశేష సేవలందించిందన్నారు.రైతు నేస్తం, డ్రోన్ అకాడమీ, అగ్రిహబ్, డిజిటల్ అగ్రికల్చర్, కృత్రిమ మేధస్సు ఆధారిత పరిశోధనలతో విశ్వవిద్యాలయం భవిష్యత్ వ్యవసాయానికి కేంద్రబిందువుగా మారుతోందని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచ వ్యవసాయం ప్రస్తుతం AI, రోబోటిక్స్, డ్రోన్లు, ప్రెసిషన్ అగ్రికల్చర్ వైపు వేగంగా అడుగులు వేస్తోందని, తెలంగాణ కూడా ఆ దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.ఇకపై కేవలం ఉత్పత్తి పెంపుపై కాకుండా పంటలకు విలువ పెంచడం, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతులపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. రైతు ఆదాయం పెరగాలంటే విలువ ఆధారిత వ్యవసాయం, మార్కెట్ ఆధారిత వ్యవసాయం వైపు అడుగులు వేయాలని చెప్పారు.అలాగే భవిష్యత్తులో కార్బన్ క్రెడిట్స్, బయో ఎకానమీ, క్లైమేట్ స్మార్ట్ అగ్రికల్చర్ వంటి రంగాలు రైతులకు కొత్త ఆదాయ వనరులుగా మారనున్నాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణ కూడా రైతుకు ఆదాయ వనరుగా మారే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు.తెలంగాణ వ్యవసాయం ఉత్పత్తి కేంద్రిత వ్యవసాయం నుంచి విలువ ఆధారిత, సాంకేతిక ఆధారిత, మార్కెట్ ఆధారిత వ్యవసాయంగా రూపాంతరం చెందాలని, ఆ మార్పుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నాయకత్వం వహించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి మరియు కమిషన్ సభ్యులు స్థానిక శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్, రిటైర్డ్ సుప్రీం కోర్టు జడ్జి బి సుదర్శన్ రెడ్డి, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్ ప్రొఫెసర్, మధుర స్వామినాథన్, మాజీ పార్లమెంట్ సభ్యుడు, పాలసీ అనలిస్ట్ ఉండవల్లి అరుణ్ కుమార్, మాజీ మరియు ప్రస్తుత వైస్ ఛాన్సలర్లు జానయ్య, రాజిరెడ్డి, జ్ఞానేందర్, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, అధ్యాపకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# లారీ యజమానులపై కాంట్రాక్టర్ల కక్ష్య సాధింపు

- **బెగులూరు ఇసుక ర్యాంప్‌లో అక్రమ వసూళ్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 12:**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా బెగులూరు ఇసుక ర్యాంప్‌లో ఇసుక లారీల వద్ద అక్రమ వసూళ్లు బహిరంగంగా కొనసాగుతున్నాయని పెద్ద అంబర్‌పేట ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలగోని భాస్కర్ గౌడ్ ఆరోపించారు.

అసోసియేషన్ అధ్యక్షుడు తెలిపిన వివరాల ప్రకారం, TGMDC ద్వారా డీడీ నంబర్ ORD14170286 తీసుకొని లోడింగ్‌కు వెళ్లిన TS05UA4617 నంబర్ లారీ యజమాని మునుకుంట్ల శేఖర్ గౌడ్ వద్ద ఇసుక ర్యాంప్ కాంట్రాక్టర్ సూపర్వైజర్ వెంకటేష్ లోడింగ్ డబ్బులు చెల్లిస్తేనే లోడింగ్ చేస్తామని, లేకపోతే లారీని పక్కకు పెట్టుకోవాలని ఒత్తిడి చేసినట్లు తెలిపారు.

**చేసేదేంలేక అట్టి లారీ యజమాని క్రింది విధంగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపించారు:**

లోడింగ్ పేరుతో – ₹2,000
కాంట పేరుతో – ₹200
సీరియల్ పేరుతో – ₹100
JCB ఆపరేటర్‌కు – ₹100
మొత్తం అదనపు భారం: ₹2,400

**ఈ మొత్తాన్ని PhonePe నంబర్ 93474 92503 ద్వారా తీసుకున్నారు**

ఈ విషయమై స్టాక్ యార్డ్ ఇన్‌చార్జ్‌ను సంప్రదించగా ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని, జిల్లా ప్రాజెక్టు అధికారి (PO)కి ఫోన్ చేసినప్పటికీ స్పందన రాలేదని లారీ యజమానులు తెలిపారు.

అదేవిధంగా TGMDC SRA అరుణ్ గారిని సంప్రదించడానికి ప్రయత్నించినప్పటికీ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో సమస్యకు పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు.ప్రభుత్వ అనుమతితో ఇసుక లోడింగ్‌కు వెళ్లిన లారీల నుంచి ఈ విధంగా అక్రమ వసూళ్లు చేయడం అత్యంత బాధాకరమని, సంబంధిత అధికారులు స్పందించకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోందని అసోసియేషన్ అధ్యక్షుడు ఆవేదన వ్యక్తం చేశారు.కావున బెగులూరు ఇసుక ర్యాంప్‌లో జరుగుతున్న అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ జరిపి,

బాధ్యులైన కాంట్రాక్టర్లు మరియు నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పెద్ద అంబర్‌పేట ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షులు మునుకుంట్ల బలరాం గౌడ్, పేదగోని నర్సింహా, అసోసియేషన్ సభ్యులు యాదగిరి, నర్సింహా,రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంక్షల ఆటలు సాగనివ్వం!

- **తమకు నచ్చినప్పుడు ఆంక్షలు పెట్టడం..**
- **నచ్చనప్పుడు తీసేయడం వాషింగ్టన్‌కు ఆటగా మారిందని వ్యాఖ్య**
- **తెరవెనుక సాగుతున్న రాజకీయం అందరికీ తెలుసని జైశంకర్ హెచ్చరిక**
- **అమెరికా బెదిరింపులతో సంబంధం లేదు..**
- **దేశ ఇంధన అవసరాల కోసం రష్యా క్రూడాయిల్ కొంటామన్న కేంద్రం**

**న్యూఢిల్లీ వెలుతురు జూన్ 12:**

రష్యా నుంచి భారతదేశం చమురు కొనుగోలు చేయడంపై పాశ్చాత్య దేశాలు చేస్తున్న దుష్ప్రచారానికి భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మరోసారి గట్టి బుద్ధి చెప్పారు. ఫిన్లాండ్‌లో జరిగిన ఒక ప్రత్యేక అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మరియు అంతర్జాతీయ చమురు మార్కెట్ పరిణామాలపై అమెరికా అవలంబిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను (డబుల్ స్టాండర్డ్స్) తనదైన శైలిలో తీవ్రస్థాయిలో ఎండగట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక సంచలన విషయాన్ని బయటపెడుతూ.. 2022లో రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన కొత్తలో ప్రపంచ చమురు మార్కెట్‌ను స్థిరీకరించడానికి, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగకుండా నియంత్రించడానికి రష్యా నుంచి చమురును కొనాల్సిందిగా స్వయంగా అమెరికాయే భారత్‌ను కోరిందని జైశంకర్ ప్రపంచ దేశాల ముందు వెల్లడించారు.

సదస్సులో ఒక అంతర్జాతీయ జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు జైశంకర్ ముఖం మీదే సమాధానం ఇచ్చారు. భారత్ రష్యాకు అనుకూలంగా వ్యవహరిస్తోందంటూ సదరు విలేకరి చేసిన వ్యాఖ్యలను ఆయన పూర్తిగా తిప్పికొట్టారు. ప్రపంచంలో ఎక్కడ చమురు తక్కువ ధరకు, సులభంగా లభిస్తుందనే అంశంపైనే భారతదేశం తన నిర్ణయాలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఉక్రెయిన్ యుద్ధం మొదలైన కొత్తలో ఐరోపా (యూరప్) దేశాలన్నీ తమ స్వార్థం కోసం మిడిల్ ఈస్ట్ (పశ్చిమాసియా) మార్కెట్ నుంచి చమురును భారీగా కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకున్నాయని గుర్తుచేశారు. ఆ సమయంలో మార్కెట్‌లో చమురు కొరత ఏర్పడటంతో, తమ దేశ ప్రజల ప్రయోజనాల కోసమే భారత్ రష్యా వైపు వెళ్లాల్సి వచ్చిందని, ఇందులో దాచడానికి ఏమీ లేదని తేల్చి చెప్పారు.

అమెరికా తన సొంత ఆర్థిక, రాజకీయ అవసరాలకు తగినట్లుగా అంతర్జాతీయ ఆంక్షలు విధించడం, మళ్లీ తమకు అవసరం తీరగానే వాటిని ఎత్తివేయడం వంటి ద్వంద్వ విధానాలపై జైశంకర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "రష్యా నుంచి చమురు కొనుగోలు చేసినందుకు గతంలో మాపై భారీ సుంకాలు విధించిన అమెరికా.. ఆ తర్వాత మళ్లీ ఆంక్షలను ఎత్తివేసింది. ఇందులో ఎలాంటి గొప్ప ప్రపంచ సిద్ధాంతాలు లేవు. తమకు నచ్చినప్పుడు ఆంక్షలు పెట్టడం, నచ్చనప్పుడు తీసేయడం వాషింగ్టన్‌కు ఒక ఆటగా మారిపోయింది. అంతర్జాతీయ సమాజంలో ఇక్కడ ఎవరూ చిన్నపిల్లలు కారు.. ఈ ఆంక్షల ఆట వెనుక ఉన్న అసలు రహస్యం ఏంటో అందరికీ బాగా తెలుసు" అని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు.

పశ్చిమాసియాలో ఇరాన్ యుద్ధ వాతావరణం ప్రారంభమైన అనంతరం ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలను అదుపులో ఉంచడానికి అమెరికా దానంతట అదే రష్యా చమురుపై ఉన్న ఆంక్షల నుంచి మినహాయింపులు ఇచ్చిందని జైశంకర్ గుర్తుచేశారు. తమకు అవసరమైనప్పుడు ఆంక్షలు సడలించి, వేరే దేశాలు కొంటే మాత్రం దానికి నైతిక రంగులు పూయాల్సిన అవసరం లేదని పాశ్చాత్య దేశాలకు హితవు పలికారు. వాణిజ్యం అనేది దేశాల అవసరాల చుట్టూ తిరుగుతుంది తప్ప, అమెరికా చెప్పే నీతుల చుట్టూ కాదని ఘాటుగా వ్యాఖ్యానించారు.

అమెరికా విధించే ఏకపక్ష ఆంక్షలతో సంబంధం లేకుండా భారతదేశం తన ఇంధన భద్రత, సొంత వాణిజ్య ప్రయోజనాల ఆధారంగానే రష్యా చమురును కొనుగోలు చేస్తోందని, భవిష్యత్తులోనూ ఈ కొనుగోళ్లు ఇలాగే కొనసాగుతాయని భారత పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. గత నెలలో జరిగిన ఒక మీడియా ప్రతినిధుల సమావేశంలో చమురు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాతా శర్మ మాట్లాడుతూ.. "అమెరికా మాకు మినహాయింపులు ఇవ్వకముందు, ఇచ్చినప్పుడు మరియు ఆ గడువు ముగిసిన తర్వాత కూడా భారత్ రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తూనే ఉంది. దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ఇంధన అవసరాలు తీర్చడమే మా ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత" అని సుజాతా శర్మ స్పష్టం చేశారు.

ఇదే అంతర్జాతీయ వేదికపై యూరప్ దేశాల నైతిక వైఖరిని కూడా భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. శాంతి గురించి మాట్లాడే యూరప్ దేశాలకు గతాన్ని గుర్తుచేశారు. ఏ యూరప్ దేశంపై కూడా భారతీయ ఆయుధాలతో దాడులు జరగలేదని.. కానీ భారత్‌పై దాడులు చేయడానికి, భారతదేశ సరిహద్దుల్లో అస్థిరత సృష్టించడానికి యూరప్ తయారుచేసిన ఆయుధాలు దశాబ్దాలుగా ఎలా ఉపయోగపడ్డాయో ఇక్కడున్న అందరికీ తెలుసని గుర్తుచేశారు. భారతీయులు ఎప్పుడూ యూరప్ భద్రతకు ముప్పు తీసుకురాలేదని.. కానీ యూరప్ మాత్రం భారత్‌కు వ్యతిరేకంగా పనిచేసే దేశాలకు నిరంతరం ఆయుధాలు విక్రయిస్తూనే ఉందని జైశంకర్ తన ఘాటైన కామెంట్లతో పాశ్చాత్య దేశాల ముసుగును తొలగించారు.

పాశ్చాత్య దేశాలు ఒకవైపు ఉక్రెయిన్ సంక్షోభాన్ని చూపిస్తూ రష్యాను ఆర్థికంగా దెబ్బతీయాలని చూస్తూనే, మరోవైపు తమ దేశాల్లో ఇంధన ధరలు పెరగకుండా రష్యా చమురు మార్కెట్లోకి వచ్చేలా భారత్‌ను వాడుకోవాలని చూస్తున్నాయని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇలాంటి అంతర్జాతీయ రాజకీయ చదరంగంలో భారతదేశం ఎవరికీ లొంగిపోయే ప్రసక్తే లేదని ఢిల్లీ స్పష్టం చేసింది. భారతదేశం ఒక స్వతంత్ర దేశమని, తన సొంత విదేశాంగ విధానం ఆధారంగానే నిర్ణయాలు ఉంటాయని జైశంకర్ ప్రసంగం ద్వారా తేలిపోయింది.

ఒకప్పుడు పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధిస్తే భయపడే పరిస్థితి నుంచి, నేడు అమెరికా, యూరప్ దేశాల కళ్లల్లో కళ్లు పెట్టి వారి తప్పులను అంతర్జాతీయ వేదికలపైనే ఎండగట్టే స్థాయికి భారత దౌత్య నీతి ఎదిగింది. ఫిన్లాండ్ సదస్సులో జైశంకర్ మాట్లాడిన మాటలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దేశ ప్రయోజనాల కోసం, సామాన్య భారతీయుడిపై ఇంధన భారం పడకుండా ఉండటం కోసం అంతర్జాతీయ ఒత్తిళ్లను ఎదిరించి నిలబడిన విదేశాంగ మంత్రిపై దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తోంది.



# 'రావు బహదూర్'.. మిగిలిన ఇండస్ట్రీలు మాట్లాడుకుంటాయి: సత్యదేవ్

ఏ భాషలో మంచి సినిమా వచ్చినా తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారని, జులై 3న 'రావు బహదూర్' విడుదలైన తర్వాత మిగిలిన ఇండస్ట్రీలన్నీ దీని గురించి మాట్లాడుకుంటాయని, కచ్చితంగా సపోర్ట్ చేస్తాయని అంటున్నారు సత్యదేవ్. ఆయన కథానాయకుడిగా వెంకటేశ్ మహ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'రావు బహదూర్'. వికాస్ ముప్పాల, దీపా థామస్, బాల పరాశర్, ఆనంద్ భారతి తదితరులు కీలక పాత్రలో నటిస్తున్నారు. గోపాలకృష్ణారెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర నిర్మాతలు. ఈ మూవీకి అగ్ర కథానాయకుడు మహేశ్‌బాబు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు.

"ఈ ఏడాది అన్ని శుక్రవారాలతో పోలిస్తే.. జులై 3న వచ్చే శుక్రవారం ప్రత్యేకం. తెలుగులో ఒక క్రేజీ మూవీ వచ్చిందని అందరూ అనుకుంటారు. మలయాళం, తమిళ్, హిందీ ఇలా ఏ భాషలో మూవీ బాగున్నా తెలుగు వాళ్లు ఎంతగానో సపోర్ట్ చేశారు. 'రావు బహదూర్' విడుదలైన తర్వాత ఆ మూవీ గురించి ఇతర ఇండస్ట్రీలు మాట్లాడుకోవడమే కాదు.. సపోర్ట్ చేస్తాయి. విదేశీయులు 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' గురించి ఎలాగైతే మాట్లాడుకున్నారో ఈ సినిమా గురించీ మాట్లాడతారు. దర్శకుడు వెంకటేశ్ మహ కేవలం ఈ సినిమా కోసమే ఇన్నేళ్లు వేచి చూశారు. ఈ మూవీలో నటించడం నాకు చాలా సంతోషంగా ఉంది. మీరు మరో కొత్త ప్రపంచాన్ని చూస్తారు. 'మా రావు బహదూర్' అని మీరంతా చెప్పుకొనేలా సినిమా ఉంటుంది. ఇందులో నాతో సహా చాలా మంది వేసుకున్న కాస్ట్యూమ్స్ చాలా ప్రత్యేకమైనవి. ఒక సన్నివేశంలో నేను వేసుకున్న దుస్తులు 1950–60 కాలంలోవి. ముంబయిలో జరిగిన వేలం కొన్న ఆ దుస్తులను శిల్ప ఇచ్చారు. ఇలా ఈ సినిమా కోసం సాంకేతిక బృందం ఎంతో కష్టపడింది" అని సత్యదేవ్ అన్నారు.

ఈ మూవీకి సంబంధించి అన్ని పనులు పూర్తయిన తర్వాత మహేశ్‌బాబుకు కూడా చూపిస్తామని నిర్మాత అనురాగ్ అన్నారు. 'మేజర్' మూవీని కూడా ఇలాగే చూపించామని, ఇప్పుడు కూడా సరైన సమయంలో ఆయన వస్తారని తెలిపారు.

# నాని చిత్రంలో రుక్మిణి?

'సప్త సాగరాలు దాటి', 'కాంతార 2' లాంటి విజయవంతమైన చిత్రాలతో దక్షిణాదిలోనే కాక ఉత్తరాదిలోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంది నటి రుక్మిణీ వసంత్. ప్రస్తుతం ఆమె చేతుల్లో యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' లాంటి భారీ చిత్రాలున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడామె తెలుగులో మరో కొత్త కబురు వినిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కథానాయకుడు నాని సొంత నిర్మాణ సంస్థ వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై నిర్మించనున్న ఓ కొత్త చిత్రం కోసం ఆమెను నాయికగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీన్ని 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ తెరకెక్కించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. ప్రధాన నటుడు ఖరారు కాగానే ఈ సినిమాని అధికారికంగా ప్రకటించే అవకాశ ముంద ని సమాచారం.



# సినిమా మొదలు పెట్టకముందే అనిల్ రావిపూడి ప్రమోషన్స్





ప్రస్తుత తెలుగు దర్శకుల్లో అనిల్ రావిపూడి మేకింగ్, టేకింగ్ డిఫరెంట్. సినిమా మొదలైన దగ్గరి నుంచి విడుదలయ్యే వరకూ ఆయన ప్రమోషన్ వర్క్ కూడా ప్రత్యేకంగానే ఉంటుంది. వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కీలక పాత్రల్లో అనిల్ దర్శకత్వంలో ఓ కొత్త మూవీ పట్టాలెక్కనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ మూవీకి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. త్వరలోనే దీనిని సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు.

సాధారణంగా ఎవరైనా మూవీ మొదలయ్యాక ప్రమోషన్స్ మొదలు పెడతారు. కానీ, ఇంకా సినిమా మొదలు పెట్టకుండానే అనిల్ వైవిధ్యంగా ప్రేక్షకుల్లోకి ఈ మూవీని తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్‌తో కలిసి ఆయన చేసిన వీడియో నవ్వులు పంచుతోంది. 'వివాహ భోజనంబు'లో సుత్తి వీరభద్రరావు, బ్రహ్మానందం మధ్య బీచ్‌లో జరిగే ఓ సన్నివేశాన్ని రీక్రియేట్ చేశారు. ఈ సందర్భంగా సుత్తి వీరభద్రరావు పలికే సంభాషణలు, అందుకు బ్రహ్మానందం హావభావాలు కడుపుబ్బా నవ్విస్తాయి. ఇప్పుడు అచ్చం అలాగే జీవీ ప్రకాశ్‌ను పీకల్లోతు ఇసుకలో పాతిపెట్టి అనిల్ రావిపూడి తన మూవీకి కావాల్సిన పాటల వివరాలు జీవీకి చెబుతూ నవ్వులు పంచారు. 'కనీసం చేతులైన బయటకు తీయండి మహాప్రభో' అంటూ జీవీ చెప్పడం, లిరిక్ రైటర్ గురించి అడిగితే 'రెండు రోజుల ముందే అతడిని పాతిపెట్టా' అంటూ అనంత్ శ్రీరామ్‌ను చూపించడం కితకితలు పెడుతోంది.

# క్రికెట్ ప్రపంచంలో ఒక శకం ముగింపు

## అంతర్జాతీయ క్రికెట్‌కు కేన్ విలియమ్సన్ రిటైర్మెంట్ ప్రకటన

న్యూజిలాండ్ క్రికెట్ దిగ్గజం, ఆధునిక క్రికెట్ 'ఫాబ్ ఫోర్' (విరాట్ కోహ్లి, స్టీవ్ స్మిత్, జో రూట్) సభ్యులలో ఒకరైన కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు తక్షణమే రిటైర్మెంట్ ప్రకటిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఇంగ్లాండ్‌తో ప్రస్తుతం జరుగుతున్న టెస్టు సిరీస్ మధ్యలోనే 35 ఏళ్ల ఈ మాజీ కెప్టెన్ ఈ ఘోషణ చేయడం క్రీడా ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. గత కొంతకాలంగా ఆలోచించిన తర్వాత, అంతర్జాతీయ వేదిక నుండి పూర్తిగా తప్పుకోవడానికి ఇదే సరైన సమయమని భావించినట్లు విలియమ్సన్ ఒక అధికారిక ప్రకటనలో తెలిపాడు. తన దేశం తరఫున ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చానని, స్వంత నిబంధనలతో ఆట నుండి తప్పుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని విలియమ్సన్ పేర్కొన్నాడు.

సుమారు 16 సంవత్సరాల సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌లో కేన్ విలియమ్సన్ అద్భుతమైన రికార్డులను నెలకొల్పాడు.

న్యూజిలాండ్ తరఫున అన్ని ఫార్మాట్లలో కలిపి అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా (19,346 పరుగులు) అగ్రస్థానంలో నిలిచాడు. ఇందులో 48 సెంచరీలు, 6 డబుల్ సెంచరీలు ఉన్నాయి. కేవలం బ్యాటింగ్‌లోనే కాకుండా తన అద్భుతమైన నాయకత్వ ప్రతిభతో 2016 నుండి 2024 వరకు బ్లాక్‌క్యాప్స్ జట్టును ఒక సువర్ణ కాలం వైపు నడిపించాడు. ఇతని కెప్టెన్సీలోనే న్యూజిలాండ్ జట్టు వరుసగా రెండుసార్లు వన్డే ప్రపంచకప్ ఫైనల్స్‌కు చేరుకోవడంతో పాటు, 2021లో భారత్‌ను ఓడించి మొట్టమొదటి ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ గెలుచుకుని చరిత్ర సృష్టించింది.

సౌమ్యుడిగా, క్రీడా స్ఫూర్తికి మారుపేరుగా నిలిచే విలియమ్సన్ రిటైర్మెంట్ ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు, తోటి ఆటగాళ్లు భావోద్వేగానికి లోనవుతున్నారు. విలియమ్సన్ వారసత్వం, ఆట పట్ల అతను చూపిన అంకితభావం ఎప్పటికీ నిలిచిపోతాయని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు కొనియాడింది.

గతేడాది నవంబర్‌లో టీ20 ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పిన విలియమ్సన్, ఇప్పుడు వన్డేలు, టెస్టుల నుండి కూడా పూర్తిగా తప్పుకోవడంతో అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక అద్భుతమైన అధ్యాయం ముగిసింది. అయితే ప్రపంచ వ్యాప్తంగా జరిగే వివిధ లీగ్ టోర్నీల్లో అతను ఆటగాడిగా కొనసాగే అవకాశం ఉంది.



# ధర్మశాలలో భారత్, ఆఫ్ఘనిస్తాన్ తొలి వన్డే సమరం

## సిరీస్ శుభారంభంపై ఇరు జట్ల కన్ను

హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ మైదానం వేదికగా శనివారం భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. ఇటీవల ముగిసిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఇన్నింగ్స్ విజయం సాధించి మంచి ఊపు మీదున్న రోహిత్ శర్మ నాయకత్వంలోని టీమిండియా, వన్డే సిరీస్‌లోనూ అదే జోరును కొనసాగించాలని పట్టుదలగా ఉంది. మరోవైపు పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఎప్పుడైనా సంచలనాలు సృష్టించగల సామర్థ్యం ఉన్న హష్మతుల్లా షాహిదీ సారథ్యంలోని ఆఫ్ఘనిస్తాన్ జట్టు, బలమైన భారత్‌కు గట్టి పోటీ ఇచ్చేందుకు వ్యూహాలు సిద్ధం చేసుకుంది. ఇరు జట్ల ఆటగాళ్లు ఇప్పటికే ఇక్కడి చల్లని వాతావరణానికి అలవాటు పడి నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నారు.

భారత జట్టు బ్యాటింగ్ విభాగంలో కెప్టెన్ రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ వంటి మేటి ఆటగాళ్లతో ఎంతో పటిష్టంగా కనిపిస్తోంది. బౌలింగ్ విభాగంలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, పేసర్ అర్ష్‌దీప్ సింగ్ కీలకం కానున్నారు. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టు తన ప్రధాన అస్త్రాలైన రషీద్ ఖాన్, మహ్మద్ నబీ, అజ్మతుల్లా ఒమర్జాయ్ వంటి ప్రపంచ స్థాయి ఆల్‌రౌండర్లపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ ఇచ్చే మెరుపు ఆరంభం ఆ జట్టుకు అత్యంత కీలకం కానుంది. ధర్మశాల పిచ్ సాధారణంగా పేసర్లకు, బ్యాటింగ్‌కు అనుకూలిస్తుండటంతో ఇక్కడ భారీ స్కోర్ల మ్యాచ్ జరిగే అవకాశం ఉంది.



ఈ సిరీస్‌లో గెలుపు అవకాశాల పరంగా చూస్తే సొంతగడ్డపై ఆడుతున్న భారత్‌కే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే వన్డే ఫార్మాట్‌లో ఆఫ్ఘనిస్తాన్ జట్టును తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. గత ప్రపంచకప్‌లో ఆ జట్టు పెద్ద జట్లను ఓడించి సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. రాబోయే ఐసీసీ టోర్నీలను దృష్టిలో ఉంచుకుని ఇరు జట్లు తమ అత్యుత్తమ తుది జట్టును పరీక్షించుకోవడానికి ఈ సిరీస్ ఒక చక్కని వేదికగా నిలవనుంది. శనివారం మధ్యాహ్నం ప్రారంభం కానున్న ఈ పోరులో టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఎక్కువగా ఉంది.

# 2027 వన్డే ప్రపంచకప్ తేదీలు ఖరారు

## రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ కాలక్రమంపై స్పష్టత!

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రతిష్టాత్మక 2027 పురుషుల వన్డే ప్రపంచకప్ నిర్వహణ తేదీలను ప్రాథమికంగా ఖరారు చేసింది. ఐపీఎల్ 2026 ఫైనల్ సందర్భంగా ఇక్కడ జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. తాజా నివేదికల ప్రకారం ఈ మెగా టోర్నీ వచ్చే ఏడాది అక్టోబర్ 4 నుండి ప్రారంభం కానుండగా, నవంబర్ 21న జరిగే ఫైనల్ మ్యాచ్‌తో ముగియనుంది. సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ ప్రపంచకప్‌లో మొత్తం 54 మ్యాచ్‌లు జరగనున్నాయి. వీటిలో అత్యధికంగా 41 మ్యాచ్‌లు సౌతాఫ్రికాలో నిర్వహించనుండగా, జింబాబ్వేలో ఎనిమిది, నమీబియాలో మూడు మ్యాచ్‌లు జరగనున్నట్లు సమాచారం. సౌతాఫ్రికా సుమారు 24 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ పురుషుల వన్డే ప్రపంచకప్‌నకు ఆతిథ్యం ఇవ్వబోతోంది.




ఈ ప్రపంచకప్ తేదీల ప్రకటనతో భారత క్రికెట్ దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అంతర్జాతీయ కెరీర్ ముగింపుపై స్పష్టమైన కాలక్రమం వచ్చింది. ప్రస్తుతం టెస్టు క్రికెట్ నుండి తప్పుకున్న ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లకు అంతర్జాతీయ వన్డేల్లో సుమారు ఒకటిన్నర సంవత్సరాల సమయం మాత్రమే మిగిలి ఉంది. 2027 వన్డే ప్రపంచకప్ వీరికి చివరి అంతర్జాతీయ టోర్నీ కానుందని, ఈ మెగా ఈవెంట్ ముగిసిన తర్వాత ఇద్దరు దిగ్గజాలు బ్లూ జెర్సీకి పూర్తిగా వీడ్కోలు పలికే అవకాశం ఉందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం 39 ఏళ్ల వయసున్న రోహిత్ శర్మ తన ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ జట్టును నడిపిస్తుండగా, 37 ఏళ్ల విరాట్ కోహ్లీ వన్డేల్లో తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు.

ఈ ప్రతిష్టాత్మక టోర్నీ ఐసీసీ కొత్త ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్ ( 2027–2031) క్యాలెండర్‌లో మొదటి ప్రధాన ఈవెంట్‌గా నిలవనుంది. ఈ సుదీర్ఘ క్యాలెండర్, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ విస్తరణ వంటి అంశాలపై ఈ ఏడాది చివర్లో హాంకాంగ్‌లో జరిగే ఐసీసీ వార్షిక సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఒకే ఒక్క ఫార్మాట్ ఆడుతున్న రోహిత్, కోహ్లీ రాబోయే 18 నెలల కాలంలో ప్రపంచకప్ వంటి పెద్ద టోర్నీ కోసం తమను తాము ఎలా సిద్ధం చేసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన ఈ ఇద్దరు స్టార్ ఆటగాళ్లను మరోసారి ప్రపంచకప్ వేదికపై చూడటానికి అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత

- **నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్**
- **హుస్నాబాద్‌లో 'అరైవ్–అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం**

**హుస్నాబాద్, వెలుతురు జూన్ 12:**










ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ముగింపు కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్స్‌లో శుక్రవారం "అరైవ్–అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పోలీసులు రోడ్డు నిబంధనలను ఉల్లంఘించడం వల్ల జరిగే ప్రమాదాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఓవర్ స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి కారణాలతో ప్రమాదాలు ఎలా సంభవిస్తున్నాయో వీడియోల ద్వారా ప్రజలకు వివరించారు. అలాగే డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు యువత జీవితాలను ఎలా నాశనం చేస్తున్నాయో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటు బాధితులకు సీపీఆర్ (CPR) ఎలా చేయాలో నిపుణుల ద్వారా ప్రదర్శన ఇచ్చి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలతో రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఆటో డ్రైవర్లకు యూనిఫాంలు, వాహనదారుల సురక్షిత ప్రయాణం కోసం హెల్మెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రహదారి భద్రత కోసం పోలీసు, రవాణా శాఖలు సంయుక్తంగా చేపడుతున్న "అరైవ్–అలైవ్" కార్యక్రమం రాజకీయాలకు అతీతమైన సామాజిక ఉద్యమమని అన్నారు. ఇంటి పెద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే ఆ కుటుంబం ఎదుర్కొనే బాధ వర్ణనాతీతమని పేర్కొన్నారు.వేగంగా వాహనాలు నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్లే అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ఎలా జరుగుతున్నాయో జిల్లా పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆధ్వర్యంలోని పోలీసులు ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించారని అన్నారు.గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రముఖులు తమ కుటుంబ సభ్యులను కోల్పోయారని, ఆ బాధను మాటల్లో చెప్పలేమని మంత్రి పేర్కొన్నారు. డ్రగ్స్ బారిన పడిన యువత జీవితాలు ఎలా నాశనం అవుతున్నాయో సమాజం చూస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.తల్లిదండ్రులు పిల్లలపై నిరంతర పర్యవేక్షణ కలిగి ఉండాలని, వారు ఎటువంటి కార్యకలాపాల్లో పాల్గొంటున్నారో ప్రతిరోజూ గమనించాలని సూచించారు. పిల్లలు క్రమశిక్షణతో ఎదగడానికి కుటుంబాల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు.రోడ్డు ప్రమాదం జరిగిన మొదటి గంటలో బాధితుడిని ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి కేంద్ర ప్రభుత్వం రూ.25 వేల నగదు ప్రోత్సాహకంతో పాటు "రహవీర్ అవార్డు" అందజేస్తోందని తెలిపారు. ఏడాదిలో ఐదు సార్లు ఈ అవార్డు పొందే అవకాశం కూడా కల్పించారని చెప్పారు.ప్రజలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మొబైల్ ఫోన్ మాట్లాడాల్సి వస్తే వాహనాన్ని పక్కకు ఆపి మాట్లాడాలని, మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపకూడదని సూచించారు. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.హుస్నాబాద్‌ను రాష్ట్రంలోనే రోడ్డు భద్రతా నిబంధనలు పాటించే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రమాదాలు జరిగిన తర్వాత లక్షల రూపాయలు ఖర్చు చేసి చికిత్స చేయించుకోవడం కంటే, ముందుగానే నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించడం ఉత్తమమని అన్నారు.

రాబోయే వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి, పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాళ్, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఆటో డ్రైవర్లు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు, వెలుతురు జూన్ 12:**

నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో చేపట్టిన రూ.75 కోట్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇస్నాపూర్, ఇంద్రేశం, గుమ్మడిదల ప్రాంతాల్లో 50 శాతం పనులు ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. జిన్నారం మున్సిపాలిటీలో టెండర్లు పొందిన కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించకపోవడంతో వారిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి తిరిగి టెండర్లు పిలవాలని ఎమ్మెల్యే సూచించారు. గడ్డపోతారంలో వచ్చే వారంలో అన్ని పనులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పురోగతిని పరిశీలించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఇస్నాపూర్ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారంగా 10 ఎకరాల్లో బయో మైనింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలో రూ.10 కోట్లతో ఫంక్షన్ హాళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనంతో పనిచేయాలని పాలకవర్గాలకు పిలుపునిచ్చారు.